1st Year Happy Work Anniversary.

షణ్ముఖ

RNI : APTEL / 2023 / 89152

SHANMUKHAVELUGU

# వెలుగు

ప్రతి వార్త వెలుగు వైపు

తెలుగు దినపత్రిక





Good for Health

Best for Readers


THE POWER OF PEN



సంపుటి : 3 సంచిక : 33 ఎడిటర్ & పబ్లిషర్ : ఓబులశెట్టి రాధాకృష్ణ దాస్ మంగళవారం 03 ఫిబ్రవరి 2026 పేజీలు 8 : వెల 3/-ఒంగోలు

VOLUME : 03 ISSUE : 33 EDITOR & PUBLISHER : OBULASETTY RADHAKRISHNA DASS PUBLISHED : ONGOLE Tuesday 03 February 2026 PAGES : 8 PRICE : 3/-


## అలజడి సృష్టించేందుకే వైకాపా కుట్ర.. ఆ ట్రాప్‌లో పడొద్దు



(షణ్ముఖ వెలుగు, అమరావతి,ఫిబ్రవరి 02)

రాష్ట్రంలో హింసను ప్రేరేపించటానికి వైకాపా కుట్రలు పన్నుతోందని తెదేపా అధినేత, సీఎం చంద్రబాబు అన్నారు. అధికారం కోల్పోయామనే అసహనంతోనే రెచ్చగొట్టే చర్యలకు పాల్పడుతోందని.. అలజడి సృష్టించేందుకే ఆ పార్టీ నేతలు బూతులు మాట్లాడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మంత్రులు, పార్టీ సీనియర్ నేతలతో సీఎం టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. "తిరుమల లడ్డూ కల్తీ వ్యవహారంలో వైకాపా అడ్డంగా దొరికిపోయింది. రాష్ట్ర ప్రజలంతా ఆ పార్టీని ఛీదరించుకుంటున్నారు. చేసిన పాపాలను దారిమళ్లించాలనేది వైకాపా కుట్ర. పెట్టుబడులు సాధించి రాష్ట్రాన్ని -మిగతా 2లో

## వైకాపా గుర్తింపును రద్దు చేయాలి



(షణ్ముఖ వెలుగు, అమరావతి,ఫిబ్రవరి 02)

భవిష్యత్ తరాలు ఆందోళన చెందేలా వైకాపా నేతలు వ్యవహరిస్తున్నారని తెదేపా ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావువిమర్శించారు. ఆ పార్టీ గుర్తింపును రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ అంశంపై కేంద్ర ఎన్నికల సంఘానికి లేఖ రాయనున్నట్లు తెలిపారు. సీఎం చంద్రబాబుపై మాజీ మంత్రులు అంబటి రాంబాబు అసభ్య వ్యాఖ్యల నేపథ్యంలో విశాఖలో గంటా శ్రీనివాసరావు మీడియాతో మాట్లాడారు. ఈ సందర్భంగా మాజీ సీఎం జగన్‌తో పాటు వైకాపా నేతలు అంబటి రాంబాబు, కొడాలి నాని, పేర్ని నాని, జోగి రమేశ్, రోజా చేసిన మురికి వ్యాఖ్యల వీడియోలను ఆయన ప్రదర్శించారు.

నాలుగు సార్లు సీఎంగా ఉన్న చంద్రబాబును ఉద్దేశించి ఇష్టానుసారంగా మాట్లాడితే ప్రజల్లో ఆగ్రహం ఉంటుందని గంటా శ్రీనివాసరావు అన్నారు. -మిగతా 2లో

## బడ్జెట్‌పై వైకాపా నేతలకు కనీస అవగాహన లేదు

భాజపా ఎంపీ పురందేశ్వరి




(షణ్ముఖ వెలుగు, అమరావతి, ఫిబ్రవరి 02)

బడ్జెట్‌పై కనీసం అవగాహన లేనివారే విమర్శలు చేస్తున్నారని ఆంధ్రప్రదేశ్ భాజపా ఎంపీలు పురందేశ్వరి, సీఎం రమేశ్ ఆక్షేపించారు. దిల్లీలో బడ్జెట్‌పై కేంద్రమంత్రి శ్రీనివాస వర్మతో కలిసి ఎంపీలు మీడియాతో మాట్లాడారు. బడ్జెట్‌పై వైకాపా సహా విపక్షాల ఆరోపణలను ఖండించారు. బడ్జెట్‌తో ఏపీకి కలిగే ప్రయోజనాలను వివరించారు. "ప్రతిపక్ష నేతలు బడ్జెట్‌ను సరిగ్గా అర్థం చేసుకోలేదు. పోలవరానికి రూ. 3,300 కోట్లకుపైగా నిధులను కేంద్రం కేటాయించింది. అమరావతిలో మౌలిక వసతుల కోసం రూ.400 కోట్లు ఇవ్వనుంది. 15వ ఆర్థిక సంఘం రికమెండేషన్‌ను కొనసాగిస్తూ రూ. 63 వేల కోట్ల ప్రయోజనాలు రానున్నాయి. 16వ ఆర్థిక సంఘం గ్రాంట్ ప్రకారం రూ.1.04 లక్షల కోట్ల రికమెండేషన్‌ను స్వీకరిస్తున్నట్లు బడ్జెట్‌లో ఉంది. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లోని స్థానిక సంస్థల్లో రోడ్ల నిర్మాణం, మౌలిక సదుపాయల కోసం నిధులు వస్తాయి" అని పురందేశ్వరి తెలిపారు. -మిగతా 2లో

# ఇది ముందుచూపు బడ్జెట్

### బడ్జెట్‌పై ముఖ్యమంత్రి చంద్రబాబు

- ▶▶అన్ని ప్రాంతాలు, వర్గాల ప్రజల అభివృద్ధికి దోహదం
- ▶▶రాష్ట్రాభివృద్ధికి ఊతమిస్తుంది
- ▶▶రైలు, మైన్, టూరిజం కారిడార్లతో ఏపీకి లబ్ధి
- ▶▶ప్రధాని మోదీ, కేంద్ర ఆర్థికమంత్రిని అభినందిస్తున్నా
- ▶▶ఈ నెల 14 లేదా 15న అమరావతికి బిల్‌గేట్స్



(షణ్ముఖ వెలుగు, అమరావతి,ఫిబ్రవరి 02)

కేంద్ర బడ్జెట్ సమతుల, ముందుచూపుతో కూడినదని ముఖ్యమంత్రి చంద్రబాబు కితాబిచ్చారు. ఒక్క మాటలో చెప్పాలంటే ఇది ఫ్యూచరిస్టిక్ బడ్జెట్ అని అన్నారు. భారతదేశానికి ఉన్న అనుకూలతలను తర్వాత స్థాయికి తీసుకెళ్లడానికి ఇది దోహదం చేస్తుందన్నారు. మన దేశం సొంత కాళ్లపై నిలబడేలా బడ్జెట్‌ను రూపొందించారన్నారు. అన్ని ప్రాంతాలు, వర్గాల అభివృద్ధికి ఉపయోగపడుతుందని అభిప్రాయపడ్డారు. భారత్ అభివృద్ధి చెందే ఎకానమీగా మారడంలో ప్రస్తుత బడ్జెట్ కీలకపాత్ర పోషిస్తుందన్నారు. రాబోయే రోజుల్లో ఈ సంస్కరణలను మరో దశకు తీసుకెళ్లాలని ఆయన సూచించారు. ఈయూతో ఇటీవల మన దేశం చారిత్రాత్మకమైన స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం(ఎఫ్‌టీఏ) కుదుర్చుకుందని..

అందులోని లక్ష్యాలనూ సాధించేందుకు ఇది ఉపకరిస్తుందన్నారు. ప్రధాని మోదీ, ఆర్థిక మంత్రి నిర్మలను మనస్ఫూర్తిగా అభినందిస్తున్నానని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు. వారు స్వల్ప, మధ్య, దీర్ఘకాలిక సుస్థిరాభివృద్ధిని దృష్టిలో ఉంచుకుని బడ్జెట్‌ను తయారు చేశారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం దృష్టి సారించిన అంశాల్లో మరింత దూకుడుగా వెళ్లడానికి ఈ బడ్జెట్ సహకరిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. చిత్తూరు జిల్లాలోని సొంత నియోజకవర్గం కుప్పంలో -మిగతా 2లో

## ఆ విషయంలో జగన్ ఇప్పటికైనా చంద్రబాబుకు క్షమాపణ చెప్పాలి

వర్ల రామయ్య



(షణ్ముఖ వెలుగు, అమరావతి,ఫిబ్రవరి 02)

స్కిల్ డెవలప్‌మెంట్ కేసులో టీడీపీ అధినేత చంద్రబాబును అక్రమంగా అరెస్టు చేసి, ఆయన జీవితంలోని 53 విలువైన రోజులను గత జగన్ ప్రభుత్వం దొంగిలించిందని టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు వర్ల రామయ్య తీవ్రంగా విమర్శించారు. చంద్రబాబుపై కేవలం రాజకీయ కక్షతోనే తప్పుడు కేసు బనాయించారని, ఇందుకు జగన్ బహిరంగంగా క్షమాపణ చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. సోమవారం నాడు మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు.గతంలో రాష్ట్రాన్ని వివిధ సామాజిక వర్గాలకు చెందిన ముఖ్యమంత్రులు పాలించారని, అప్పుడు ప్రభుత్వాల మధ్య అభివృద్ధి, ప్రజాసేవలో మాత్రమే పోటీ ఉండేదని వర్ల రామయ్య గుర్తుచేశారు. అయితే 2019లో జగన్ అధికారంలోకి వచ్చాక రాష్ట్ర రాజకీయాల్లోకి కక్ష, ద్వేషం, ఫ్యాక్షనిజం ప్రవేశించాయని ఆరోపించారు. అప్రజాస్వామిక, రాజ్యాంగ విరుద్ధ పాలనతో రాష్ట్రాన్ని ఐదేళ్ల పాటు నాశనం చేశారని మండిపడ్డారు. ఈ కక్షపూరిత రాజకీయాల్లో భాగంగానే అప్పటి ప్రతిపక్ష నేతగా ఉన్న చంద్రబాబుపై స్కిల్ డెవలప్‌మెంట్ పేరుతో తప్పుడు కేసు నమోదు చేశారన్నారు. సీమెన్స్ ప్రాజెక్టుకు విడుదలైన నిధులు చంద్రబాబుకు గానీ, ఆయన కుటుంబ సభ్యులకు గానీ చేరలేదని స్పష్టంగా తెలిసినప్పటికీ, రాజకీయ ప్రత్యర్థిని శత్రువుగా భావించి జైలుకు -మిగతా 2లో

## రాష్ట్రాభివృద్ధికి వైసీపీ వైరస్‌లా మారింది

- మంత్రి అనగాని సత్యప్రసాద్
- రాష్ట్రంలో అశాంతి సృష్టించేందుకు జగన్ ముఠా కుట్రలు చేస్తోందన్న మంత్రి
- వైసీపీ హయాంలో లడ్డూ కోసం 60 లక్షల కేజీల కల్తీ నెయ్యి వాడారని ఆరోపణ
- చట్టాన్ని అతిక్రమిస్తే ఎంతవారైనా శిక్ష తప్పదన్న అనగాని
- టీడీపీ ఎజెండా అభివృద్ధి, విధ్వంసం కాదని స్పష్టీకరణ



(షణ్ముఖ వెలుగు, అమరావతి,ఫిబ్రవరి 02)

రాష్ట్రంలో అల్లర్లు సృష్టించి, అశాంతిని రెచ్చగొట్టేందుకు వైసీపీ అధ్యక్షుడు జగన్, ఆయన 'సైకో ముఠా' కుట్రలు పన్నుతున్నాయని రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ తీవ్రంగా ఆరోపించారు. సోమవారం టీడీపీ కేంద్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. అధికారంలో ఉన్నా, లేకపోయినా బూతులు తిట్టడం, కులాలు-మతాల మధ్య చిచ్చుపెట్టి రాజకీయ లబ్ధి పొందడమే జగన్ సిద్ధాంతమని ఆయన విమర్శించారు. రాష్ట్రాభివృద్ధికి, తెలుగు ప్రజల అభివృద్ధికి జగన్ ఒక వైరస్‌లా మారారని మండిపడ్డారు.

**లడ్డూలో 60 లక్షల కేజీల కల్తీ నెయ్యి**

గత వైసీపీ ప్రభుత్వ హయాంలో తిరుమల లడ్డూ ప్రసాదం తయారీలో భారీ కుంభకోణం జరిగిందని అనగాని సంచలన ఆరోపణలు చేశారు. చుక్క పాలు కూడా వాడకుండా, జంతువుల కొవ్వుతో తయారు చేసిన 60 లక్షల కేజీల కల్తీ నెయ్యిని వినియోగించారని తెలిపారు. -మిగతా 2లో

## ఏపీ అభివృద్ధికి ఈ బడ్జెట్ ఊతం ఇస్తుంది

(షణ్ముఖ వెలుగు, అమరావతి,ఫిబ్రవరి 02)



'వికసిత్ భారత్ లక్ష్యాలు సాధించేలా కేంద్ర బడ్జెట్ ఉంది. యువశక్తిని మేల్కొల్పి, ప్రతి అవకాశాన్నీ అందిపుచ్చుకుని మౌలిక ప్రగతికి బాటలు వేస్తూ 2047 నాటికి భారత్‌ను ప్రబల ఆర్థికశక్తిగా నిలపాలన్న ప్రధాని మోదీ సంకల్పం ఈ బడ్జెట్‌లో కనిపిస్తోంది. ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి ఇది ఊతం ఇచ్చేలా ఉంది' అని ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ అభిప్రాయపడ్డారు. ఆయన ఆదివారం రాత్రి ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేశారు. 'సంస్కరణలు, సంక్షోభ నివారణ, మౌలిక ప్రగతి, దేశ భద్రత, రైతు సంక్షేమం, వికసిత గ్రామీణ భారతం, ఆర్థిక స్వావలంబన తదితర అంశాలకు ఈ బడ్జెట్ పెద్దపీట వేసింది' అని ఉప ముఖ్యమంత్రి పేర్కొన్నారు. 'పర్యాటక రంగంలో ఇస్తున్న ప్రోత్సాహకాలు అరకు వంటి పర్యాటక ప్రాంతాలకు ఊతం ఇస్తాయి. ఏడు హైస్పీడ్ కారిడార్లలో మూడు ఆంధ్రప్రదేశ్ మీదుగానే వెళతాయి. కేంద్రం ఎంపిక చేసిన రేర్ ఎర్త్ మినరల్స్ కారిడార్లలో ఆంధ్రప్రదేశ్ కూడా ఉండటం వల్ల విలువైన ఖనిజాల వెలికితీత, తయారీ రంగాన్ని ప్రోత్సహిస్తుంది. ఉప్పాడ 100 రోజుల ప్రణాళికకు ఈ బడ్జెట్ ఊతం ఇస్తుంది. కొబ్బరి, జీడిపప్పు, కోకో రైతుల కోసం ప్రవేశపెట్టిన పథకాలు కోనసీమ, ఉత్తరాంధ్ర జిల్లాల రైతులకు ఊరటనిస్తాయి' అని ఆయన అభిప్రాయపడ్డారు.

## చట్టాన్ని చేతుల్లోకి తీసుకోవద్దు.. టీడీపీ శ్రేణులకు పల్లా, అచ్చెన్న కీలక ఆదేశాలు

- టీడీపీ శ్రేణులు చట్టాన్ని గౌరవించాలని, సంయమనం పాటించాలని స్పష్టమైన ఆదేశాలు
- దాడులు, హింస టీడీపీ సంస్కృతి కాదని తెలిపిన నేతలు
- వైసీపీ ఉచ్చులో పడకుండా అభివృద్ధిపై దృష్టి పెట్టాలని కార్యకర్తలకు పిలుపు
- కేంద్ర బడ్జెట్‌లోని కేటాయింపులను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని సూచన



(షణ్ముఖ వెలుగు, అమరావతి,ఫిబ్రవరి 02)

తప్పు చేసిన వారిపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తప్పవని భరోసా టీడీపీ శ్రేణులు సంయమనం పాటించాలని, ఎవరూ చట్టాన్ని తమ చేతుల్లోకి తీసుకోవద్దని పార్టీ రాష్ట్ర నాయకత్వం స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. ఇటీవల జరిగిన కొన్ని సంఘటనల నేపథ్యంలో పార్టీ జాతీయ అధ్యక్షుడు, సీఎం చంద్రబాబు ఆదేశాల మేరకు రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు పార్టీ నేతలతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, దాడులు, ప్రతిదాడులు మన సంస్కృతి కాదని, ప్రజాస్వామ్య విలువలకు కట్టుబడి ఉండాలని పిలుపునిచ్చారు. టెలికాన్ఫరెన్స్‌లో పల్లా శ్రీనివాసరావు మాట్లాడుతూ.. ఇటీవలి పరిణామాలపై చంద్రబాబు తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారని తెలిపారు. "గత ఐదేళ్ల వైసీపీ పాలనలో చట్టాన్ని చేతుల్లోకి తీసుకుని సాగించిన అరాచకాలను మనం వ్యతిరేకించాం. ఇప్పుడు మనమే అలా ప్రవర్తించడం సరికాదు. -మిగతా 2లో

## రోడ్డు భద్రత నియమాలను ప్రతిఒక్కరూ కచ్చితంగా పాటించాలి


### జిల్లా జాయింట్ కలెక్టర్ పులి శ్రీనివాసులు





(షణ్ముఖ వెలుగు, మార్కాపురం టౌన్, ఫిబ్రవరి 2)
రోడ్డు భద్రత నిబంధనలు పాటించాల్సిన అవసరాన్ని తెలియజేస్తూ జాతీయ రోడ్డు భద్రత మహోత్సవాల సందర్భంగా మార్కాపురం పట్టణంలో సోమవారం అధికారలు, పోలీసులు, విద్యార్థులతో కలసి అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీని మార్కాపురం జిల్లా జాయింట్ కలెక్టర్ పులి శ్రీనివాసులు, మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి, మార్కాపురం డిఎస్పీ యు నాగరాజు జెండా ఊపి ప్రారంభించారు. ప్లకార్డులతో రోడ్డు భద్రత పై ప్రజలకు అవగాహన కల్పించారు. రోడ్డు ప్రమాదాలు తగ్గించాలంటే ప్రతి వాహనదారుడు తప్పనిసరిగా రహదారి నియమనిబంధనలు పాటించాలని జిల్లా జాయింట్ కలెక్టర్ పులి శ్రీనివాసులు స్పష్టం చేశారు. ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి మాట్లాడుతూ రోడ్డు భద్రత పై ప్రజల్లో చైతన్యం పొందాల్సిన అవసరాన్ని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో మార్కాపురం సిఐ సుబ్బారావు, టౌన్ ఎస్ఐ సైదుబాబు, మార్కాపురం రూరల్ ఎస్ఐ అంకమరావు, విద్యార్థులు, ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.

## నిర్మమహేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల గోడ, ఆహ్వాన పత్రికల ఆవిష్కరణ





(షణ్ముఖ వెలుగు, పొదిలి, ఫిబ్రవరి 2)
మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని శ్రీ పార్వతీ దేవి సమేత నిర్మమహేశ్వర స్వామి వార్షిక బ్రహ్మోత్సవాలకు పొదిలి శివాలయం సిద్ధమవుతోంది. సోమవారం మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి నివాసంలో బ్రహ్మోత్సవాలకు సంబంధించిన ఆహ్వాన పత్రిక, గోడ పత్రికలను ఆయన చేతుల మీదుగా అట్టహాసంగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ భక్తులందరూ ఈ బ్రహ్మోత్సవాల్లో పాల్గొని స్వామివారి కృపాకటాక్షాలు పొందాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం కార్యనిర్వహణాధికారి నర్రా నారాయణరెడ్డి, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గునుపూడి భాస్కర్, దేవస్థానం చైర్మన్ ఒగ్గు వెంకటరామయ్య, ధర్మకర్తలు కొణిజేటి లక్ష్మీనారాయణ, నూతక్కి నాగేశ్వరరావు, సోమిశెట్టి శ్రీనివాసులు, కాశిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## మార్కాపురం నియోజకవర్గ ఐటిడిపి అధ్యక్షుడిగా శ్రీకాంత్ గిద్దలూరి



(షణ్ముఖ వెలుగు, పొదిలి, ఫిబ్రవరి 2)
మార్కాపురం నియోజకవర్గ తెలుగుదేశంపార్టీ అనుబంధ సంఘమైన ఐటిడిపి అధ్యక్షుడిగా శ్రీకాంత్ గిద్దలూరి నియమితులయ్యారు. పార్టీ సిద్ధాంతాల పట్ల నిబద్ధత, సంస్థాగత పనితీరులో చురుకైన పాత్ర, యువతతో బలమైన అనుబంధాన్ని పరిగణలోకి తీసుకుని ఈ పదవి బాధ్యతలను పార్టీ అప్పజెప్పినట్లు తెలిసింది. ఈ నియామకం సందర్భంగా సహకరించిన మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి, యువ నేత కందుల విగ్నేష్‌రెడ్డిలకు శ్రీకాంత్ ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. ఇక నుంచి పార్టీ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్ళాలని ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి ఆయన కుమారుడు కందుల విగ్నేష్‌రెడ్డిలు సూచించారు.

## మొదటి పేజీ తరువాయి

# ఇది ముందుచూపు బడ్జెట్

మూడు రోజుల పర్యటనకు వచ్చిన ముఖ్యమంత్రి చంద్రబాబు చివరి రోజైన ఆదివారం శాంతిపురం మండలం తులసినాయనపల్లెలో విలేకరుల సమావేశం నిర్వహించి బడ్జెట్‌పై తన అభిప్రాయాలను వెల్లడించారు.

**ప్రపంచంలోనే డైనమిక్ జోన్ అవుతుంది.**

'మన రాష్ట్రం మీదుగా మూడు హైస్పీడ్ రైలు కారిడార్లు వెళ్తాయి. చెన్నై–బెంగళూరు కారిడార్‌లో తిరుపతినీ అనుసంధానించాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరతా. ఈ మూడు కారిడార్‌లలో హైదరాబాద్, అమరావతి, చెన్నై, బెంగళూరు నగరాలు ఉంటాయి. ఈ కారిడార్‌లు అందుబాటులోకి వస్తే ఎక్కడికైనా సులభంగా వెళ్లవచ్చు. ప్రపంచంలో ఎక్కడా లేని విధంగా ఇది డైనమిక్ జోన్ అవుతుంది. ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్, ఎంఎస్ఎంఈలను ప్రోత్సహించడం, బలోపేతం చేయడానికి బడ్జెట్ ఉపకరిస్తుంది. పేదరిక నిర్మూలనకు దోహదం చేసేలా నేను తొలిసారిగా తీసుకొచ్చిన విధానం పీ–4. రెండోది వన్ ఫ్యామిలీ–వన్ ఆంత్రప్రెన్యూర్. ప్రతి ఒక్కరూ ఎంఎస్ఎంఈ స్థాపించాలి.ఇందుకోసం బడ్జెట్‌లో ఎస్ఎంఈ గ్రోత్ ఫండ్ కింద రూ.10 వేల కోట్లు ప్రకటించారు. కార్పొరేట్ మిత్ర వ్యవస్థకు శ్రీకారం చుడుతున్నారు. ఎంఎస్ఎంఈలకు బ్యాంకులు ఇచ్చే రుణంలో 70 శాతం కేంద్రం, 25 శాతం రాష్ట్రం హామీగా ఉంటుంది. స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌కు అవసరమైన జీఎస్టీ, కార్మిక సంస్కరణలు తీసుకొచ్చాం. నాలాను రద్దు చేశాం. రాష్ట్ర ప్రభుత్వం అభివృద్ధికి చేస్తున్న అన్ని ప్రయత్నాలకు వెసులుబాటు కల్పించేలా బడ్జెట్ ఉంది' అని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు.

**రేర్ ఎర్త్ కారిడార్‌లో ఏపీ**

'మన దేశం బాగా అభివృద్ధి చెందుతోంది. ఏఐలో మనం నంబర్ వన్‌గా ఉన్నాం. విద్యుత్తు రంగంలోనూ పురోగమిస్తున్నాం. ఈ రెండింటికీ తోడు ప్రపంచంలో ఎక్కడాలేని విధంగా మనకు యువ జనాభా ఉంది. ఈ మూడింటినీ సద్వినియోగం చేసుకునేలా బడ్జెట్‌కు రూపకల్పన చేశారు. రేర్ ఎర్త్ కారిడార్‌లో ఆంధ్రప్రదేశ్‌నూ చేర్చారు. ఇండియా సెమీ కండక్టర్ మిషన్ 2.0కు శ్రీకారం చుట్టారు. రూ.40 వేల కోట్లు కేటాయించారు. 2047 వరకు పన్ను మినహాయింపు కల్పించారు. భారతదేశం డేటా సెంటర్ హబ్‌గా తయారవుతుంది. విశాఖలో 10 గిగివాట్ల సామర్థ్యంతో డేటా సెంటర్లు స్థాపించడానికి పలు సంస్థలు ముందుకొచ్చాయి. డేటా సెంటర్ వస్తే ఏఐ వస్తుంది. త్వరలో ఏఐ విశ్వవిద్యాలయం ప్రారంభిస్తాం.

ఎన్విడియా, ఇతర కంపెనీలతో కలిసి హైదరాబాద్‌లోని ఐబీఎం తరహాలో స్వతంత్ర ప్రతిపత్తి సంస్థగా మారుస్తాం. ఏఐ లివింగ్ ల్యాబ్‌లు అందుబాటులోకి తెస్తాం. ఈ నెల 14న లేదా 15న అమరావతికి బిల్‌గేట్స్ వస్తున్నారు. ప్రపంచంలోని అన్ని పెద్ద కంపెనీలు మన దగ్గరకు వస్తున్నాయి. ఏఐ, క్వాంటమ్, డేటా సెంటర్లు, తర్వాత దశ సాంకేతికతలకు ఏపీ చిరునామా అవుతోంది. కుప్పంలో ఏడో తరగతి విద్యార్థి ఒకరు ఏఐ సాయంతో నా బీపీ, మధుమేహం, గుండె ఆరోగ్యాన్ని వివరించడం చూసి ఆశ్చర్యం కలిగింది. టెక్స్‌టైల్‌కు బడ్జెట్‌లో ఊతమివ్వడం ద్వారా ఎక్కువ మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించినట్లవుతుంది' అని చంద్రబాబు తెలిపారు.

**అరకు కాఫీని కూడా కలుపుతా..**

'బడ్జెట్‌లో పర్యాటక, ఆతిథ్య రంగాలకూ ప్రాధాన్యం ఇచ్చారు. భవిష్యత్తులో ఈ రంగాల ద్వారానే ఎక్కువ ఉద్యోగ, ఉపాధి అవకాశాలు వస్తాయి. ఆతిథ్యానికి భారత్ పెట్టిన పేరు. అందులో ఏపీ అగ్రస్థానంలో ఉంది. అరకు రీజియన్‌లో పర్యాటక హబ్ తీసుకొస్తున్నారు. తిరుపతి జిల్లాలో పులికాట్ సరస్సును ఆధారంగా చేసుకుని ఏటా ఫ్లెమింగో వేడుకలు జరుపుతున్నాం. పులికాట్‌లో పక్షులను వీక్షించడానికి వచ్చేవారికి ప్రత్యేక సౌకర్యాలు కల్పిస్తామని చెప్పడం అభినందనీయం.జీడి, కొబ్బరి, కోకో, చందనం పంటలకు ప్రోత్సాహం ఇచ్చేలా ప్రకటన చేశారు. ఇందులో అరకు కాఫీని కూడా కలుపుతాం. ప్రపంచంలోనే అత్యుత్తమ ఉద్యాన క్లస్టర్‌గా రాయలసీమ జిల్లాలు మారబోతున్నాయి. డీపీ వరల్డ్ లాంటి ప్రతిష్ఠాత్మక సంస్థలు ఇక్కడికి వస్తున్నాయి. పూర్వోదయ ద్వారా నిధులు ఇస్తామని బడ్జెట్‌లో పెట్టారు. బయోఫార్మాకు రూ.10 వేల కోట్లు కేటాయించారు. ఈ ఏడాదిలో సంజీవని గేమ్‌ఛేంజర్ అవుతుంది' అని సీఎం చంద్రబాబు ధీమా వ్యక్తం చేశారు.

**మూడు నగరాలను ఉన్నత దశకు తీసుకెళ్తాం**

'బడ్జెట్‌లో లాజిస్టిక్స్ హబ్‌కు ప్రాధాన్యం ఇచ్చారు. మనం ఎప్పుడో దీన్ని ప్రారంభించాం. ఇప్పుడు డబ్బులు కూడా సమీకరిస్తున్నాం. కంటెయినర్ల తయారీకి చేయూతనివ్వాలని నిర్ణయించారు. కోస్టల్ కార్గో, అంతర్గత జల రవాణా, ఫ్రైట్ కారిడార్‌లకు పెద్దపీట వేశారు. మనకు ఇచ్ఛాపురం నుంచి చెన్నై వరకు ఉత్తర–దక్షిణ కారిడార్ ఉంది. దీన్ని కర్ణాటక, తెలంగాణ, ఛత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్, ఒడిశాతో మన నౌకాశ్రయాలను అనుసంధానించాలి. అప్పుడు ఈస్ట్ కోస్ట్ హబ్‌గా తయారవుతుంది. దాంతో లాజిస్టిక్స్ పరంగా గణనీయమైన వృద్ధి నమోదవుతుంది.

వెయ్యి కిలోమీటర్ల మన కారిడార్‌లో ప్రతి 50 కి.మీలకు ఒక పోర్టు నిర్మిస్తున్నాం. అంతర్గత జల రవాణాకు కూడా ఊతమిచ్చేలా బడ్జెట్‌లో నిధులు కేటాయించారు. పట్టణాల అభివృద్ధి, గ్రోత్ సెంటర్లకు నిధులు కేటాయించారు. రాష్ట్రంలో విశాఖ గ్రోత్ రీజియన్, తిరుపతి, అమరావతి ఎకనామిక్ రీజియన్లుగా మారుతాయి. ఈ మూడు నగరాలను ఉన్నత దశకు తీసుకెళ్తాం. రేణిగుంటను ప్రత్యేక రైల్వేజోన్‌గా కాదు కానీ హబ్‌గా తయారు చేయాలని ప్రణాళిక రూపొందించాం. తిరుపతి– రేణిగుంట మధ్యలో ఇది వస్తుంది' అని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు.

# రాష్ట్రాభివృద్ధికి వైసీపీ వైరస్‌లా మారింది

ఇదే విషయాన్ని సెట్ నివేదిక స్పష్టం చేసిందని, కానీ వైసీపీ నేతలు రిపోర్టులను తారుమారు చేసి తప్పుడు ప్రచారం చేస్తున్నారని అన్నారు. ఈ కల్తీ నెయ్యి వ్యవహారంలో దొరికిపోయిన దొంగ భూమన కరుణాకర్ రెడ్డి అని, ఇప్పుడు తన తప్పును కప్పిపుచ్చుకోవడానికి తిరుపతిలో ఫ్లెక్సీలతో విద్వేషాలు రెచ్చగొడుతున్నారని ధ్వజమెత్తారు. 151 సీట్ల నుంచి 11 సీట్లకు పడిపోయినా వైసీపీ నేతల్లో మార్పు రాలేదని, 'యథా రాజా తథా ప్రజా' అన్నట్టు జగన్‌ను చూసి భూమన, అంబటి వంటి నేతలు వ్యవహరిస్తున్నారని ఎద్దేవా చేశారు.

**అభివృద్ధే టీడీపీ ఎజెండా**

విధ్వంసం సృష్టించడం కాదని, అభివృద్ధే టీడీపీ అజెండా అని అనగాని స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు రోజుకు 20 గంటలు రాష్ట్రం కోసం పనిచేస్తున్నారని, పోలవరం, అమరావతి నిర్మాణానికి కేంద్ర బడ్జెట్‌లో నిధులు కేటాయించడం శుభపరిణామమని అన్నారు. రాష్ట్రం అభివృద్ధి పథంలో దూసుకుపోతుంటే, జగన్, ఆయన ముఠా రాక్షసుల్లా అడ్డుపడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

గత ప్రభుత్వ హయాంలో జరిగిన తోట చంద్రయ్య, అమర్ అనే బాలుడి హత్య కేసుల్లో బాధితులకు న్యాయం చేస్తామని, ప్రభుత్వపరంగా ఆ కుటుంబాలను ఆదుకున్నామని తెలిపారు. చట్టాన్ని చేతుల్లోకి తీసుకోవద్దని, దాడులు చేయడం మన పార్టీ సంస్కృతి కాదని సీఎం చంద్రబాబు స్పష్టంగా చెప్పారని గుర్తుచేశారు. తప్పు చేస్తే పార్టీతో సంబంధం లేకుండా ఎంతటివారైనా చట్ట ప్రకారం శిక్ష అనుభవిస్తారని హెచ్చరించారు. వైసీపీ బూతు రాజకీయాలను, కుట్రలను ప్రతి వేదికపై ఎండగడతామని అనగాని సత్యప్రసాద్ పేర్కొన్నారు.

# అలజడి సృష్టించేందుకే వైకాపా కుట్ర..

## ఆ ట్రాప్‌లో పడొద్దు

అభివృద్ధి చేయాలన్నదే మన ప్రధాన అజెండా. అది వైకాపా నేతలకు నచ్చడం లేదు. అందుకే అడ్డుకునేందుకు కుట్రలకు పాల్పడుతున్నారు. తప్పు చేసిన ప్రతి ఒక్కరినీ చట్టపరంగా శిక్షించి తీరుతాం. తెదేపా కార్యకర్తలు సంయమనం పాటించేలా మంత్రులు, నేతలు బాధ్యత తీసుకోవాలి. కార్యకర్తలు చట్టాన్ని చేతుల్లోకి తీసుకుని వైకాపా ట్రాప్‌లో పడొద్దు. అలా జరగకుండా పార్టీ నేతలు జాగ్రత్తలు తీసుకోవాలి. హింస, విధ్వంసం, అవినీతి పునాదులపై వైకాపా పుట్టింది. ఆ పార్టీ ట్రాప్‌లో పడితే వారికీ.. మనకీ తేడా ఉండదు " అని చంద్రబాబు అన్నారు. ఈ టెలీకాన్ఫరెన్స్‌లో తెదేపా రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, మంత్రులు పయ్యావుల కేశవ్, అచ్చెన్నాయుడు, అనగాని సత్యప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# వైకాపా గుర్తింపును రద్దు చేయాలి

వైకాపా హయాంలో ఆయన్ను విశాఖ ఎయిర్‌పోర్ట్‌లో ఘోరంగా అడ్డుకున్నారని చెప్పారు. ఉనికిని కాపాడుకునేందుకు ఆ పార్టీ యత్నిస్తోందని.. పైగా కులాలను ఆపాదిస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. చంద్రబాబుపై అనుచిత వ్యాఖ్యలు చేస్తే.. అసెంబ్లీలో వైఎస్ఆర్ సైతం క్షమాపణ చెప్పిన ఘటనలు చూశామన్నారు.

# బడ్జెట్‌పై వైకాపా నేతలకు కనీస అవగాహన లేదు

**వారికేం తెలుసు?: సీఎం రమేశ్ :** "బడ్జెట్ గురించి వైకాపా నేతలకు ఏం తెలియదు. అధికారంలో ఉన్నప్పుడు దాచుకోవడం, దోచుకోవడమే వారికి తెలుసు. కూటమి ప్రభుత్వం ఎలా ముందుకెళ్తుందో ప్రజలకు తెలుసు. ఈ బడ్జెట్ ద్వారా రాష్ట్రానికి చాలా ప్రయోజనాలు రానున్నాయి. టెక్నాలజీ, గ్రీన్ అమ్మోనియా ప్రాజెక్టుల ప్రయోజనాల్లో ఎక్కువగా ఏపీకే కలగనున్నాయి." అని సీఎం రమేశ్ తెలిపారు.

**వాస్తవాలు పరిశీలించాలి: కేంద్రమంత్రి శ్రీనివాస వర్మ**

"బడ్జెట్‌లో గ్రామీణాభివృద్ధికి అధిక ప్రాధాన్యత దక్కింది. ఏప్రిల్ 1 నుంచి వీబీజీ రామ్‌జీ పథకం అమల్లోకి రానుంది. దీనికి భారీగా నిధులు కేటాయించారు. వాస్తవాలను పట్టించుకోకుండా వక్రీకరించడం సరికాదు" అని కేంద్రమంత్రి శ్రీనివాస వర్మ అన్నారు.

# ఆ విషయంలో జగన్ ఇప్పటికైనా చంద్రబాబుకు క్షమాపణ చెప్పాలి: వర్ల రామయ్య

పంపారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కుట్రతో చంద్రబాబును 53 రోజుల పాటు జుడిషియల్ కస్టడీలో ఉంచి జగన్ తన కక్ష తీర్చుకున్నారని విమర్శించారు.అయితే, సీఐడీ దర్యాప్తులోనే డిజైన్‌టెక్‌కు చెల్లించిన నిధులు ఏ ప్రజాప్రతినిధికీ చేరలేదని, ప్రతి రూపాయికి లెక్క ఉందని తేలిందని వర్ల రామయ్య తెలిపారు. దీంతో ఈ కేసును 'మిస్టేక్ ఆఫ్ ఫ్యాక్ట్'గా పేర్కొంటూ వెనక్కి తీసుకున్నారని చెప్పారు. ఈడీ కూడా ఈ కేసులో చంద్రబాబుకు ఎలాంటి ప్రమేయం లేదని స్పష్టం చేసిందని గుర్తుచేశారు. జైలులో కనీస సౌకర్యాల కోసం కూడా చంద్రబాబు కోర్టును ఆశ్రయించాల్సి రావడం జగన్ ప్రభుత్వ కక్ష సాధింపు చర్యలకు నిదర్శనమని అన్నారు.చంద్రబాబు జైలులో ఉన్న 53 రోజులూ రాష్ట్ర ప్రజలు ఆయన సేవలను గుర్తుచేసుకున్నారని, ఐదేళ్ల వైసీపీ అరాచక పాలనకు ఇటీవలి ఎన్నికల్లో 11 సీట్లతో ప్రజలు తగిన తీర్పు ఇచ్చారని వ్యాఖ్యానించారు. ఒక నిజాయతీపరుడైన నాయకుడిని జైలులో పెట్టినందుకు ప్రపంచవ్యాప్తంగా 108 దేశాల్లో నిరసనలు వెల్లువెత్తాయని చెప్పారు. ఇప్పటికైనా జగన్ కు నైతిక విలువలు ఉంటే.. చంద్రబాబుకు, ఆయన కుటుంబానికి, టీడీపీ కార్యకర్తలు, అభిమానులకు బహిరంగ క్షమాపణ చెప్పాలని వర్ల రామయ్య డిమాండ్ చేశారు.

# చట్టాన్ని చేతుల్లోకి తీసుకోవద్దు.. టీడీపీ శ్రేణులకు పల్లా, అచ్చెన్న కీలక ఆదేశాలు


సోషల్ మీడియాలోని ప్రేరణలకు లోనై స్పందించవద్దు. చట్టాన్ని గౌరవించడమే మన పార్టీ బ్రాండ్ ఇమేజ్" అని ఆయన స్పష్టం చేశారు. అదే సమయంలో కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి లభించిన ప్రయోజనాలను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలని సూచించారు. అమరావతికి రూ.1,088 కోట్లు, పట్టణాభివృద్ధికి రూ.452 కోట్లు, గ్రామీణ రహదారులకు రూ.500 కోట్లు కేటాయించడం వంటి అంశాలను వివరించాలని కోరారు.వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు మాట్లాడుతూ... గత ఐదేళ్లలో టీడీపీ కార్యకర్తలు, నాయకులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారని గుర్తు చేశారు. "టీడీపీని రాజకీయంగా అంతం చేయాలనే దురుద్దేశంతో కేసులు పెట్టి, చంద్రబాబు గారిని జైలుకు పంపినా పార్టీ వెనక్కి తగ్గలేదు. ప్రజలు మనపై నమ్మకంతో అధికారం ఇచ్చారు. రాష్ట్రాన్ని పునర్నిర్మించాల్సిన బాధ్యత మనపై ఉంది" అని అన్నారు. చంద్రబాబు అనుభవం, ప్రధాని మోదీ సహకారంతో కేవలం 20 నెలల్లోనే రాష్ట్రాన్ని గాడిలో పెట్టగలమన్న ధీమా వ్యక్తం చేశారు. పోలవరం ప్రాజెక్టును 2027 నాటికి పూర్తి చేయడం, అమరావతి నిర్మాణం, విశాఖలో గూగుల్ డేటా సెంటర్ వంటి ప్రాజెక్టులతో రాష్ట్రం అభివృద్ధి పథంలో పయనిస్తోందన్నారు.కొన్ని సంఘటనలపై బాధ ఉన్నప్పటికీ, ప్రతిచర్య పేరుతో హింసకు దిగడం సరికాదని అచ్చెన్నాయుడు హితవు పలికారు. "తిరుపతి లడ్డూ కల్తీ వ్యవహారం నుంచి ప్రజల దృష్టిని మళ్లించేందుకే వైసీపీ నీచమైన కుట్రలు చేస్తోంది. వారి ఉచ్చులో పడొద్దు. తప్పు చేసిన వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటాం. దాడులు చేయడం, హింసకు పాల్పడటం టీడీపీ సంస్కృతి కాదు" అని ఆయన స్పష్టం చేశారు. ఇక, స్కిల్ కేసులో చంద్రబాబుకు ఈడీ క్లీన్ చిట్ ఇవ్వడాన్ని ప్రస్తావిస్తూ, ఆయనపై పెట్టినవన్నీ తప్పుడు కేసులని మరోసారి నిరూపితమైందని అన్నారు. కులాలు, మతాల మధ్య చిచ్చుపెట్టే ప్రయత్నాలను ప్రభుత్వం సమర్థంగా అణిచివేస్తోందని, శాంతిభద్రతల పరిరక్షణకే తమ తొలి ప్రాధాన్యత అని నేతలు భరోసా ఇచ్చారు.

# ఉపాధి హామీ పథకం నిధులతో చేపట్టిన అభివృద్ధి పనులు వేగంగా పూర్తి చేయాలి



### జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్

(షణ్ముఖ వెలుగు, బాపట్ల, ఫిబ్రవరి 2)
ఉపాధి హామీ పథకం నిధులతో చేపట్టిన అభివృద్ధి పనులు వేగంగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్ తెలిపారు. ఉపాధి హామీ పథకం అమలు తీరు పై జిల్లా, మండల స్థాయి అధికారులతో సోమవారం ఆయన కలెక్టరేట్ నుంచి వీక్షణ సమావేశం నిర్వహించారు. స్వర్ణాంధ్ర విజన్‌లో భాగంగా అభివృద్ధి అంశాలను ప్రామాణికంగా తీసుకోవాలని కలెక్టర్ చెప్పారు. మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని జి రామ్ జి పథకంగా మార్పు చేస్తున్నందున మంజూరైన పనులన్నీ శరవేగంగా పూర్తి చేయాలని ఆదేశించారు. పేరు మార్పు నేపథ్యంలో రెండు నెలల్లో ఎలాంటి మంజూరులు ఉండవన్నారు. మంజూరైన పనులని పూర్తి చేయాలని, పూర్తి చేసిన పనులకు తక్షణమే బిల్లులు ఆన్ లైన్ లో సమర్పించాలన్నారు. అధికారులు జాప్యం చేయరాదని సూచించారు. 233 గ్రామపంచాయతీలలో ఉపాధి పనులు జరగకపోవడంపై అధికారులను నిలదీశారు. నిరుపేదలకు జీవనోపాధి చూపాలని, కూలి పనులు వేగంగా చేపట్టాలన్నారు. జల శక్తి అభియాన్ పనులు నిజాంపట్నంలో జాప్యం జరగడంపై అరా తీశారు. రేపల్లెలో మురికినీరు ఇంకుడు గుంతల నిర్మాణంలో జాప్యం ఉండరాదన్నారు. వర్మి కంపోస్ట్ యూనిట్ల నిర్మాణం సర్వేగంగా పూర్తి చేయాలన్నారు. గృహ నిర్మాణాలకు 90 రోజుల పని దినాలు కల్పించాలన్నారు. పల్లె పండుగలో 350 పనులు మంజూరు కాగా కేవలం 136 పనులు పురోగతిలో ఉండడం ఏమిటని కలెక్టర్ నిలదీశారు. మంజూరైన పనులు వేగంగా పూర్తి చేయాలని ఆదేశించారు. గ్రామపంచాయతీ భవనాలు పది మంజూరు కాగా, రెండు భవనాల నిర్మాణం మాత్రమే మొదలు కావడం ఏమిటన్నారు. నిర్మాణ పనులు వేగంగా పనులు ప్రారంభించాలన్నారు. ఉద్యాన పంటలు, కొబ్బరి మొక్కలు లక్ష్యం మేరకు నాటాలన్నారు. భవిష్యత్తు తరాలకు ప్రయోజనంగా ఉండేలా పనులు చేయాలన్నారు. ఉగాది నాటికి 6, 441 గృహ నిర్మాణాలు పూర్తి చేయడం లక్ష్యంగా ప్రభుత్వం నిర్దేశించిందన్నారు. మార్చి 18వ తేదీ నాటికి గృహ నిర్మాణాలు పూర్తి చేయాలన్నారు. ప్రతి వారానికి అధికారులు లక్ష్యాలు నిర్దేశించుకుని పనిచేయాలని మార్గ నిర్దేశం చేశారు. ఈ సమావేశంలో డ్వామా పిడి విజయలక్ష్మి, గృహ నిర్మాణ శాఖ పిడి వెంకటేశ్వరరావు, ఎంపీడీవోలు ఇంజినీర్లు, తదితరులు పాల్గొన్నారు.





ప్రకాశం | మార్కాపురం | బాపట్ల

షణ్ముఖ

# వెలుగు

ప్రతి వార్త వెలుగు వైపు
తెలుగు దినపత్రిక

03.02.26 మంగళవారం

## రెవెన్యూ పనితీరుకు
# అద్దం పట్టిన ప్రజాదర్బార్

### చిన్నపాటి సమస్య కూడా ప్రజాదర్బార్‌కు వచ్చిన వైనం



- ప్రజల ఆరోగ్యం పట్ల రెవెన్యూ అధికారి నిర్లక్ష్యం
- ఎమ్మెల్యే చెప్పిన వెంటనే సాయంత్రం లోగా సంతకం చేస్తానన్న పరిస్థితి
- అధికారులు ప్రజాసమస్యల పట్ల నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదు
- ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి

(షణ్ముఖ వెలుగు, కొనకనమిట్ల, ఫిబ్రవరి 2)

రెవెన్యూ అధికారుల పనితీరుకు కొనకనమిట్ల మండల కేంద్రంలో మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రజాదర్బార్ అద్దం





పట్టింది. చిన్న సమస్యను కూడా ఎమ్మెల్యే పరిశీలించిన తర్వాతనే చేసే పరిస్థితి స్పష్టంగా తెలిసింది. ఓ కుటుంబం వైద్యం నిమిత్తం ఆరోగ్యశ్రీ కార్డు లేకపోవడంతో ప్రజాదర్బార్ లో ఎమ్మెల్యేకు విన్నవించుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. వాస్తవానికి ఆరోగ్యశ్రీ కార్డు లేని వారికి తహశీల్దార్ అందుకు సంబంధించిన సర్టిఫికేట్ మంజూరు చేస్తే ఆ కుటుంబం వైద్యశాలలో వైద్యం చేయించుకోవచ్చు. కాని ఎమ్మెల్యే నిర్వహించిన ప్రజాదర్బార్‌లో అర్జీ ఇచ్చిన వెంటనే ఎమ్మెల్యే ఆరోగ్యశ్రీ కార్డు లేని వారికి వెంటనే (తరువాయి 4లో...)

## పీ4 స్ఫూర్తితో 'బాపట్ల సేవా సేతు' ప్రారంభం



(షణ్ముఖ వెలుగు, బాపట్ల, ఫిబ్రవరి 2)

జిల్లాలోని ప్రభుత్వ వసతి గృహాల్లో విద్యార్థులు ఎదుర్కొంటున్న మౌలిక సదుపాయాల లోపాలను తొలగించేందుకు బాపట్ల జిల్లా కలెక్టర్ డాక్టర్ వి వినోద్ కుమార్ వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. పీ--4 స్ఫూర్తితో దాతలను, వసతి గృహాలను అనుసంధానించే లక్ష్యంతో రూపొందించిన 'బాపట్ల సేవా సేతు' పోర్టల్‌కు మంచి స్పందన లభిస్తోంది. కలెక్టర్ పిలుపునకు స్పందించిన చీరాలకు చెందిన కృతి ఫౌండేషన్ సోమవారం జిల్లాలోని రెండు విద్యా సంస్థల్లో మౌలిక వసతుల కల్పనకు చేయూతనందించింది. చీరాల మండలం ఈపురుపాలెం పరిధిలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో విద్యార్థినుల కోసం 16 కుర్చీలను అందజేయగా, పర్చూరు మండలంలోని గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాల బాలుర వసతి గృహంలో విద్యార్థుల కోసం 47 బకెట్లు, మగ్గులను పంపిణీ చేశారు. వసతి గృహాల అవసరాలను గుర్తించి తక్షణమే స్పందించిన కృతి ఫౌండేషన్ చైర్మన్ ఆకురాతి వెంకట అశ్విని బృందాన్ని జిల్లా కలెక్టర్ అభినందించారు. ఈ కార్యక్రమంలో కృతి ఫౌండేషన్ ప్రతినిధులు ఉడత చంద్రశేఖర్, టి ఝాన్సీ కళ, మలిపెద్ది వీరబాబు, వాలంటీర్ బొమ్మిరెడ్డి యశ్వంత్, తదితరులు పాల్గొన్నారు. (తరువాయి 4లో...)

# అనుభవం లేని పాలనతో ఐదేళ్లు వెనుకబాటు

- సీఎం చంద్రబాబు సమర్థతతో అభివృద్ధి గాడిలో రాష్ట్రం
- రాష్ట్ర ఇంధనశాఖ మంత్రి గొట్టిపాటి ఐదేళ్లు రాక్షసి పాలన... అస్తవ్యస్తం
- పర్చూరు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు
- ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు దిశగా ప్రభుత్వం
- దేశంలో ఎక్కడా లేని విధంగా విద్యుత్ చార్జీలు తగ్గింపు
- వైసీపీ పాలనలో విద్యుత్ ఉత్పత్తి లేదు అంతా కొనుగోలు
- రూ.17 కోట్ల 37 లక్షల అభివృద్ధి పనులకు శంకుస్థాపన ప్రారంభోత్సవాలు
- యనమలలో సబ్ స్టేషన్ ను ప్రారంభం
- రూ.7.40 కోట్ల ఆర్ అండ్ బి రోడ్లకు శంకుస్థాపన
- 95 మందికి 51,48,729 సిఎంఆర్ఎఫ్ చెక్కులు అందజేత
- రూ.4 కోట్ల స్త్రీ నిధి చెక్కులు అందజేత

(షణ్ముఖ వెలుగు, పర్చూరు, ఫిబ్రవరి 2)

పాలనపై అవగాహన, అనుభవం లేని వ్యక్తికి అధికారాన్ని అప్పగించడం వల్ల గత ఐదేళ్లలో రాష్ట్రం అభివృద్ధికి నోచుకోకపోగా, పదేళ్ల పాలనలో వెనుకబాటుకు గురైందని విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్, పర్చూరు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు అన్నారు. ఆ పరిస్థితిని ప్రత్యక్షంగా అనుభవించిన ప్రజలే అపార అనుభవం, సమర్థత కలిగిన చంద్రబాబు నాయుడుకు మళ్లీ ముఖ్యమంత్రి పదవి అప్పగించారని తెలిపారు. సోమవారం పర్చూరు నియోజకవర్గంలోని యద్దనపూడి, మార్టూరు మండలాల్లో నిర్వహించిన వివిధ అభివృద్ధి పనుల శంకుస్థాపన, ప్రారంభోత్సవ కార్యక్రమాల్లో మంత్రి గొట్టిపాటి రవికుమార్, ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు పాల్గొన్నారు.



## పాకలలో బీచ్ ఫెస్టివల్



(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, ఫిబ్రవరి 2)

మహాశివరాత్రి సందర్భంగా ఈ నెల 14, 15 తేదీలలో పాకలలో బీచ్ ఫెస్టివల్ నిర్వహించేందుకు ప్రభుత్వం తరపున అవసరమైన చర్యలు తీసుకోవాలని రాష్ట్ర మారిటైమ్ బోర్డు చైర్మన్ దామచర్ల సత్యనారాయణ కోరారు. జిల్లా కలెక్టర్ పి రాజాబాబును సోమవారం ప్రకాశం భవనంలో మర్యాదపూర్వకంగా కలిసి ఈ మేరకు వినతిపత్రం సమర్పించారు. అదే విధంగా జిల్లా జాయింట్ కలెక్టర్‌గా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన కల్పనా కుమారిని మర్యాదపూర్వకంగా కలిసి మొక్కను అందజేశారు.

## అన్ని రంగాల్లోనూ జిల్లా ప్రకాశించేలా చర్యలు

### రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయ స్వామి



(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, ఒంగోలు, ఫిబ్రవరి 2)

అన్ని రంగాల్లోనూ జిల్లా ప్రకాశించేలా చర్యలు తీసుకుంటున్నట్లు రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీ బాలవీరాంజనేయ స్వామి చెప్పారు. ప్రకాశం జిల్లా 57వ ఆవిర్భావ దినోత్సవం సోమవారం ప్రకాశం భవనంలో ఘనంగా జరిగింది. ముందుగా ఈ ప్రాంగణంలో ఉన్న ప్రకాశం జిల్లా పతాకాన్ని ఆయన ఆవిష్కరించారు. అనంతరం ప్రకాశం పంతులు విగ్రహానికి కలెక్టర్ పి రాజాబాబు, ఎస్పీ వి హర్షవర్ధన్‌రాజు, జాయింట్ కలెక్టర్ కల్పనా కుమారి, (తరువాయి 5లో...)

# కేసులకు, దాడులకు భయపడేది లేదు

- అసత్యాలను ప్రచారం చేస్తూ రెచ్చగొడుతున్నారు
- కల్తీ నెయ్యి ఆరోపణలలో ఎన్డిడిబి రిపోర్టు ఎక్కడ
- కాపు నేతలని టార్గెట్ చేస్తున్నారు
- మీడియా సమావేశంలో బూచేపల్లి ధ్వజం

(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, ఒంగోలు, ఫిబ్రవరి 2)




అక్రమ కేసులకు, దాడులకు వైసిపి భయపడదని వైసిపి జిల్లా అధ్యక్షులు, దర్శి ఎమ్మెల్యే డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. ఒంగోలులోని వైసీపీ జిల్లా కార్యాలయంలో సోమవారం మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బూచేపల్లి మాట్లాడుతూ తిరుమల లడ్డూలో నెయ్యి కల్తీ జరిగిందని ఎన్డిడిబి వంటి సంస్థల రిపోర్టులు లేకుండానే ఏకపక్షంగా రాష్ట్రవ్యాప్తంగా మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి, వై వి సుబ్బారెడ్డి, కరుణాకర్ రెడ్డి పేర్లు ప్రస్తావిస్తూ అసత్య ప్రచారాలు చేస్తూ ఉంటే, మాజీ రాష్ట్ర మంత్రి అంబటి రాంబాబు ఫ్లెక్సీలను వెంటనే తొలగించేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులకు విన్నవించుకున్నారన్నారు. టిడిపి కార్యకర్తలు అంబటిని రెచ్చగొట్టడంతో అంబటి ముఖ్యమంత్రి పై (తరువాయి 4లో...)

# సబ్ డివిజన్ పరిధిలో పలు స్టేషన్‌లు తనిఖీ

- శాంతిభద్రతల పరిరక్షణ, మహిళా సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇవ్వాలి
- నేరాల కట్టడి, రోడ్డు ప్రమాదాల నియంత్రణ పై ప్రత్యేక దృష్టి సారించాలి
- అసాంఘిక, చట్టవ్యతిరేక కార్యకలాపాల కట్టడికి గట్టి చర్యలు తీసుకోవాలి
- విధి నిర్వహణలో అలసత్వం వహించిన సిబ్బంది పై శాఖపరమైన చర్యలు తప్పవు
- జిల్లా ఎస్పీ వి హర్షవర్ధన్‌రాజు


# అనుభవం లేని పాలనతో ఐదేళ్లు వెనుకబాటు






**దేశంలో ఎక్కడా లేని విధంగా విద్యుత్ చార్జీల తగ్గింపు**

ఈ సందర్భంగా మంత్రి గొట్టిపాటి రవికుమార్ మాట్లాడుతూ తాను మంత్రి అయిన అనంతరం తొలిసారిగా యనమదల విద్యుత్ ఉపకేంద్రానికి శంకుస్థాపన చేశామని, ఆ తరువాతే రాష్ట్రవ్యాప్తంగా 200కుపైగా ఉపకేంద్రాలకు శంకుస్థాపనలు జరిగాయని తెలిపారు. గత ప్రభుత్వంలో ట్రూ-అప్ చార్జీల పేరిట సామాన్యులపై విద్యుత్ భారం మోపారని, ఆ భారాన్ని కూటమి ప్రభుత్వం ప్రజలపై వేయకుండా ప్రభుత్వమే భరించిందన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా విద్యుత్ చార్జీలను తగ్గించిన ఘనత కూటమి ప్రభుత్వానిదేనని పేర్కొన్నారు. వచ్చే ఏడాది మరో రూ.1.19 పైసలు తగ్గించేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రయత్నిస్తున్నారని తెలిపారు.



**పెన్షన్లు, ఫీజు బకాయిలు, రైతులకు భరోసా**

ఒకే సంతకంతో పెన్షన్లు పెంచిన ప్రభుత్వం కూటమి ప్రభుత్వమేనని, దేశంలో ఎక్కడా లేని విధంగా పెన్షన్లు అందిస్తున్నామని మంత్రి తెలిపారు. గత ప్రభుత్వం విద్యార్థుల కాలేజీ ఫీజు బకాయిలు పెట్టగా, కూటమి ప్రభుత్వం ఒకేసారి రూ.10 వేల కోట్లు విడుదల చేసిందని గుర్తు చేశారు. దేశంలో తొలిసారిగా బార్లీ పొగాకును ప్రభుత్వమే కొనుగోలు చేసిందని, దీనికి ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు కృషే కారణమని తెలిపారు. ఈ క్రమంలో బార్లీ రైతులకు రూ.270 కోట్లు విడుదల చేశామని చెప్పారు. పామాయిల్ సాగును ప్రోత్సహించేందుకు కూడా చర్యలు చేపడుతున్నట్లు పేర్కొన్నారు.

**యద్దనపూడి అభివృద్ధే లక్ష్యం - ఎమ్మెల్యే ఏలూరి**

ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు మాట్లాడుతూ ఐదేళ్ల రాక్షస పాలన అనంతరం చంద్రబాబు నాయకత్వంలో కూటమి ప్రభుత్వం రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడుపుతోందన్నారు. గత ప్రభుత్వంలో అరాచకాలు, భౌతిక దాడులు తప్ప అభివృద్ధి లేదని, తొమ్మిది సార్లు విద్యుత్ చార్జీలు పెంచి ప్రజలను ఇబ్బంది పెట్టారని విమర్శించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజల జీవన ప్రమాణాలు పెంచేలా అభివృద్ధి, సంక్షేమాన్ని వేగవంతం చేసిందన్నారు. తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ, ఉచిత బస్సు ప్రయాణం వంటి అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నామని తెలిపారు. భవిష్యత్తులో విద్యుత్ చార్జీలు పెంచబోమని స్పష్టం చేశారు. యద్దనపూడి మండలంలో సాగునీరు, తాగునీరు, రోడ్ల సమస్యలను దశలవారీగా పరిష్కరిస్తామని, అన్ని గ్రామాలకు ఇంటింటి కుళాయి ద్వారా నీటి సరఫరా లక్ష్యంగా పనిచేస్తున్నామని చెప్పారు. నీటి వసతి కల్పిస్తే ఈ ప్రాంతం పారిశ్రామికంగా మరింత అభివృద్ధి చెందుతుందని పేర్కొన్నారు.

**లో వోల్టేజ్ సమస్యకు శాశ్వత పరిష్కారం**

యద్దనపూడి, పూనూరు ఉపకేంద్రాలపై అధిక లోడ్ కారణంగా లో వోల్టేజ్ సమస్య ఏర్పడుతుండటంతో యనమదలలో కొత్త ఉపకేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు మంత్రి తెలిపారు. ఉపకేంద్ర నిర్మాణానికి స్థలం కేటాయించిన డాక్టర్ లింగా శ్రీనివాసరావు, కేవీ రెడ్డిలను అభినందించారు. యద్దనపూడిలో పాత విద్యుత్ స్తంభాలను తొలగించి కొత్త స్తంభాలు ఏర్పాటు చేస్తామని వెల్లడించారు.

**రూ.17.37 కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపన, ప్రారంభోత్సవాలు**

మంత్రి గొట్టిపాటి రవికుమార్, ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావులు పర్చూరు నియోజకవర్గంలో రూ.17 కోట్ల 37 లక్షల వ్యయంతో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు నిర్వహించారు. రూ.1.40 కోట్ల వ్యయంతో యనమదల నుంచి బల్లికురవ-పోలూరు ఆర్అండ్‌బీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. రూ.85 లక్షలతో సీసీ రోడ్ల నిర్మాణ పనులను ప్రారంభించారు. యనమదలలో రూ.4.65 కోట్లతో నిర్మించిన 33/11 కేవీ విద్యుత్ ఉపకేంద్రాన్ని ప్రారంభించారు. దర్శి నుంచి వలపర్ల సమీపంలోని ఎంఎస్ఎంఈ సేజ్ వరకు రూ.6 కోట్లతో నిర్మించనున్న రోడ్డు పనులకు శంకుస్థాపన చేశారు.

**రూ.4 కోట్ల స్త్రీ నిధి రుణాలు,95 మందికి చెక్కులు...**

స్త్రీ నిధి పథకం కింద రూ.4 కోట్ల రుణాలు మంజూరు మంత్రి గొట్టిపాటి ఎమ్మెల్యే ఏలూరి చేతుల మీదుగా అందజేశారు. ఎమ్మెల్యే ఏలూరి సిఫారసు మేరకు వైద్య ఖర్చుల నిమిత్తం 95 మందికి రూ.51,48,729 విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందజేశారు. డీఆర్‌డీఏ సహకారంతో ఆరుగురు లబ్ధిదారులకు ఒక్కో లబ్ధిదారునికి రూ.70 వేల సబ్సిడీతో 6 ఎగ్ కార్ట్స్ పంపిణీ చేశారు.

# రెవెన్యూ పనితీరుకు అద్దం పట్టిన ప్రజాదర్బార్





తహశీల్దార్ సర్టిఫికేట్ మంజూరు చేయచ్చు కదా అని ప్రశ్నించిన వెంటనే తహశీల్దార్ సురేష్ సాయంత్రంలోగా సంతకం చేసి సర్టిఫికేట్ ఇస్తాను అని చెప్పడం చూస్తే సదరు అధికారి ఏ విధంగా ప్రజలకు సేవలు అందిస్తున్నారో అర్థం చేసుకోవచ్చు. ఇది ఒక్కటే కాదు ప్రజలతో ఓ వైపు జిల్లా కలెక్టర్ కుటుంబ సభ్యుల్లా కలిసిమెలిసి వారి సమస్యలు పరిష్కరించాలని చెబుతున్నా ఈ తహశీల్దార్ మాత్రం అందుకు పూర్తి విరుద్ధంగా వ్యవహరిస్తాడని చెప్పడంలో ఏ మాత్రం సందేహం లేదు. గతంలో పొదిలిలో ఇన్‌ఛార్జి గా పని చేసిన సమయంలో కూడా ఓ మీడియా ప్రతినిధికి సంబంధించిన వ్యక్తికి ఆరోగ్యం బాగా లేదు ఆసుపత్రిలో చావుబతుకుల మధ్య ఉన్నాడని మొర పెట్టుకుని సర్టిఫికేట్ మంజూరు చేయాలని విన్నవించినా నాలుగు రోజుల పాటు తిప్పారంటే ఆయన ఏవిధంగా ప్రజలకు సేవలందిస్తారో వేరే చెప్పాల్సిన అవసరం లేదు. మొత్తానికి ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి పుణ్యాన ఆ కుటుంబానికి వైద్యం అందింది. ఇలా ప్రతి చిన్న సమస్యను ఎమ్మెల్యే నే పరిష్కరించాలంటే అది వీలయ్యే పరిస్థితి కాదు... అధికారులు తమ విధులు సక్రమంగా నిర్వర్తించి చిన్న చిన్న సమస్యలను పరిష్కరించకపోతే అటు ప్రభుత్వానికి, ఇటు ఎమ్మెల్యేకు చెడ్డపేరు రావడం ఖాయం.... సోమవారం నిర్వహించిన ఈ ప్రజా దర్బార్‌లో రెవెన్యూ, పింఛన్లు, తాగునీరు, భూ వివాదాలు, సాగునీటి సరఫరా వంటి అనేక సమస్యలపై ప్రజలు 95 అర్జీలు అందజేశారు. అర్జీలను క్షుణ్ణంగా పరిశీలించిన ఎమ్మెల్యే అప్పటికప్పుడు పరిష్కరించదగ్గ సమస్యలను పరిష్కరించారు. మిగిలిన అర్జీలను నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని కఠిన ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల వద్దకే పాలనను తీసుకెళ్లడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమన్నారు. ప్రభుత్వ సేవలు ప్రతి గడపకూ అందాలని, అధికారుల నిర్లక్ష్యం వల్ల ఏ ఒక్క సామాన్యుడు ఇబ్బంది పడకూడదని హెచ్చరించారు. ప్రజా సమస్యల పరిష్కారంలో జాప్యం వహిస్తే సహించేది లేదని స్పష్టం చేశారు. ఈ ప్రజా దర్బార్ కేవలం వినతులు తీసుకోవడానికే కాకుండా, క్షేత్రస్థాయిలో సమస్యల పరిష్కార వేదికగా నిలుస్తుందని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్ ఏ సురేష్, ఎండిఓ ఈశ్వరమ్మ, మండల పార్టీ అధ్యక్షులు మూరబోయిన బాబురావు, గొట్లగట్టు సర్పంచ్ పేరికే సుఖదేవ్, చిన్నారికట్ల సొసైటీ అధ్యక్షులు సానికొమ్ము వెంకటేశ్వరరెడ్డి, మాజీ మండల పార్టీ అధ్యక్షులు తాతిరెడ్డి వెంకటేశ్వర్‌రెడ్డి, వెలుగొండ దేవస్థాన చైర్మన్ కుందూరు కాశిరెడ్డి, వివిధ శాఖలకు చెందిన అధికారులు, అర్జీదారులు పాల్గొన్నారు.

# పీ4 స్ఫూర్తితో 'బాపట్ల సేవా సేతు' ప్రారంభం



# కేసులకు, దాడులకు భయపడేది లేదు

కొంత పరుష పదజాలం వాడటం వాస్తవమే అన్నారు. అయితే వెంటనే మీడియా సమావేశం ఏర్పాటు చేసి ముఖ్యమంత్రిపై అటువంటి పరుష పదజాలం వాడటం కరెక్ట్ కాదని పేర్కొన్నారు. అయినప్పటికీ అంబటి రాంబాబు ఇంటిపై, మాజీ మంత్రి జోగి రమేష్ ఇంటిపై వైసిపి గుండాలు దాడులు చేసి తగలు పెట్టారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో లా అండ్ ఆర్డర్ పనిచేయటం లేదన్నారు. స్వార్థ రాజకీయాల కోసం టిడిపి వెంకటేశ్వర స్వామిని సైతం రాజకీయాల్లోకి లాగు తుందన్నారు. వెంటనే రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ఫ్లెక్సీలను తొలగించాలని హితవు పలికారు. సమావేశంలో జిల్లా పరిషత్ చైర్పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, వైసిపి ఒంగోలు పార్లమెంటరీ నియోజకవర్గ పరిశీలకులు బత్తుల బ్రహ్మానందరెడ్డి, వైసిపి ఒంగోలు నియోజకవర్గ ఇంచార్జ్ చుండూరి రవిబాబు, తదితరులు పాల్గొన్నారు.

# పాకలలో బీచ్ ఫెస్టివల్



# సబ్ డివిజన్ పరిధిలో పలు స్టేషన్‌లు తనిఖీ














**(షణ్ముఖ వెలుగు, కందుకూరు, ఫిబ్రవరి 2)**

సాధారణ తనిఖీల్లో భాగంగా సోమవారం జిల్లా ఎస్పీ కందుకూరు సబ్ డివిజన్లోని వలేటివారిపాలెం, లింగసముద్రం,కందుకూరు టౌన్, కందుకూరు రూరల్, గుడ్లూరు పోలీస్ స్టేషన్ లను, గుడ్లూరు సర్కిల్ కార్యాలయం, కందుకూరు సబ్ డివిజన్ కార్యాలయాలను సందర్శించి, స్టేషన్ స్థితిగతులు, సిబ్బంది పని తీరును క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్ ఆవరణ, వివిధ గదులు, మహిళా సహాయక కేంద్రం, రిసెప్షన్ కౌంటర్‌తో పాటు స్టేషన్ పరిసరాలను పరిశీలించారు. అలాగే స్టేషన్ నిర్వహణకు సంబంధించిన రికార్డులు, సీడీ ఫైల్స్ సహా పలు రికార్డులను తనిఖీ చేశారు. పోలీస్ స్టేషన్ పరిధిలో లా అండ్ ఆర్డర్ పరిరక్షణ, నేర నివారణకు చేపడుతున్న చర్యలపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకొని పలు సూచనలు చేశారు. అలాగే పోలీస్ స్టేషన్‌లో పెండింగ్‌లో ఉన్న కేసుల స్థితిగతులను పరిశీలించి, వాటి దర్యాప్తును వేగవంతంగా పూర్తి చేసి ఫిర్యాదుదారులకు త్వరితగతిన పరిష్కారం అందించాలని ఆదేశించారు. ప్రతి కేసుకు సంబంధించిన పూర్తి వివరాలను సీడి ఫైల్‌లో సక్రమంగా నమోదు చేసి దర్యాప్తు ప్రక్రియ సజావుగా సాగేలా, దర్యాప్తు నైపుణ్యాన్ని మరింత మెరుగుపరుచుకునే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. కొత్త చట్టాలప్రకారం రిజిస్టర్ లను కూడా కొత్త ప్రోఫార్మా ప్రకారం జాగ్రత్తగా నిర్వహించాలన్నారు. ప్రతి స్టేషన్ పరిధిలో మహిళలు, చిన్నారులపై జరుగుతున్న నేరాలకు సంబంధించిన ఫిర్యాదులపై అలసత్వం ప్రదర్శించకుండా, వాటిపై విచారణ వేగవంతం చేసి బాధితులకు త్వరితగతిన న్యాయం అందించేలా చూడాలి. శక్తి టీములు, మహిళా పోలీస్‌లు, డ్వాక్రా మహిళలు సమన్వయంతో మహిళలకు ఉన్న చట్టపరమైన హక్కులు, రక్షణ చట్టాలు, శక్తి యాప్ గురించి వివరించాలని, శక్తి టీమ్ సభ్యులు, గ్రామ పోలీసులతో కలిసి సమావేశాలు నిర్వహించాలని సూచించారు. మహిళాలు, పిల్లలు భద్రతాకు శక్తి టీములు సమర్ధవంతంగా విధులు నిర్వహించే విధంగా మరియు సైబర్ నేరాలు, గంజాయి వంటి మాదకద్రవ్యాలపై అవగాహన కల్పించాలన్నారు. రహదారి ప్రమాదాల నివారణకు పటిష్ట చర్యలు చేపడుతూ నిరంతరం ప్రమాదాలు జరిగే ప్రాంతాలను, జరిగేందుకు ఆస్కారం ఉన్న ప్రదేశాలను బ్లాక్ స్పాట్స్ గా గుర్తించి ఆ ప్రాంతాల్లో హెచ్చరిక బోర్డులు, బారికేడ్స్, రేడియం స్టిక్కర్స్ తో కూడిన డ్రమ్ములు ఏర్పాటుచేసి ప్రమాదాల నివారణకు కృషి చేయాలి. రోడ్డు భద్రత నియమాలు ప్రతి ఒక్కరూ పాటించాలని, వాహనాలు నడిపిటప్పుడు తనపై ఒక కుటుంబం ఆధారపడి ఉండుందని గుర్తుచేస్తుకోవాలని, హెల్మెట్ ధరించాలని, మద్యం తగి వాహనాలు నడపకూడదని, ట్రాఫిక్ మరియు రోడ్డు భద్రతపై అవగాహనా పెంచుకోవాలన్నారు. ట్రాఫిక్ నిబంధనలు ప్రకారం వాహనాలు నడపటంతోపాటు ప్రజలలో మార్పు వచ్చినపుడు రోడ్డు ప్రమాదాలు తగ్గుతాయన్నారు. ఎన్ఫోర్స్మెంట్ ను సమర్ధవంతంగా నిర్వహించాలన్నారు. బహిరంగ మద్యపానం జరుగుతున్న ప్రదేశాలను గుర్తించి అవసరమైన తనిఖీలు నిర్వహించి కేసులు నమోదు చేయాలని జిల్లా ఎస్పీ గారు అధికారులకు సూచించారు. అలాగే ఆయా ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచే విధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. బహిరంగ మద్యపానాన్ని నియంత్రించడం ద్వారా నేరాల శాతం గణనీయంగా తగ్గుతుందన్నారు. ఇప్పటి వరకు కందుకూరు టౌన్ పరిధిలో 16 బహిరంగ ప్రదేశాలను పోలీసు, స్థానిక ప్రజలు శుభ్రం చేసినట్లు తెలిపారు. కేసుల దర్యాప్తులో సిబ్బందిని కూడా భాగస్వాములను చేసి వారి నైపుణ్యాలను అభివృద్ధి చేయాలని సూచించారు. అలాగే పాత నేరస్థులు, అనుమానితులతో వ్యక్తిగతంగా మాట్లాడి వారి జీవన విధానం తదితర విషయాలను తెలుసుకోవాలని, వారి కార్యకలాపాలపై నిరంతర నిఘా ఉంచి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పోలీస్ స్టేషన్ పరిధిలో అసాంఘిక, చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడే వారిపై నిఘా ఉంచాలని అధికారులను జిల్లా ఎస్పీ ఆదేశించారు. ఆధునిక సాంకేతికతను వినియోగించుకుంటూ సమర్థవంతంగా విధులు నిర్వహించేలా సిబ్బందికి పలు సూచనలు చేశారు. అలాగే ప్రతిరోజు పై అధికారుల నుంచి వచ్చే ఆదేశాలను క్రింది స్థాయి సిబ్బందికి సమర్థంగా తెలియజేయాలని, ఆదేశాలకు అనుగుణంగా సిబ్బంది విధులు నిర్వర్తించేలా పర్యవేక్షించాలని ఆదేశించారు. విజిబుల్ పోలీసింగ్‌లో భాగంగా ప్రతి రోజు గ్రామా, వార్డులకు వెళ్లి ప్రజలతో ముఖాముఖి మాట్లాడి సమస్యలు తెలుసుకుని పరిష్కరించేందుకు కృషి చేసి ప్రజలకు మరింత మెరుగైన సేవలందించాలన్నారు. జిల్లా ఎస్పీ వెంట కందుకూరు డిఎస్పీ బాలసుబ్రమణ్యం, గుడ్లూరు సీఐ జి మంగారావు, కందుకూరు సీఐ అన్వర్ బాషా, ఎస్బి ఇన్స్పెక్టర్ శ్రీనివాసరావు, డిసిఆర్బీ ఇన్స్పెక్టర్ దేవప్రభాకర్, సబ్ డివిజన్ ఎస్ఐలు మరిది నాయుడు, శివ నాగరాజు, బాలకృష్ణ, జి మంగారావు, సిబ్బంది ఉన్నారు.

# అన్ని రంగాల్లోనూ జిల్లా ప్రకాశించేలా చర్యలు







మేయర్ గంగాడ సుజాత, ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ పి.విజయ్ కుమార్, జిల్లా గ్రంధాలయ సంస్థ చైర్పర్సన్ ఎం సుచిత్రలతో కలిసి పూలమాలలు వేసి పుష్పాంజలి ఘటించారు. అనంతరం గ్రీవెన్స్ హాలులో నిర్వహించిన కార్యక్రమంలో మంత్రి మాట్లాడుతూ వ్యవసాయం, పరిశ్రమలు, విద్య, మౌలిక రంగాలలో జిల్లాను అభివృద్ధి చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా దృష్టి సారించిందన్నారు. ఉమ్మడి ప్రకాశం జిల్లాకు ఎంతో కీలకమైన వెలుగొండతోపాటు పాలేరు, కొరిశపాడు ప్రాజెక్టులకు కూడా వచ్చే బడ్జెట్లో ప్రాధాన్యం కల్పించబోతున్నట్లు చెప్పారు. వివిధ ప్రాంతాలలో సి.బి.జి. ప్లాంట్లు, దొనకొండలో పరిశ్రమల స్థాపన ద్వారా తలసరి ఆదాయం పెంచేలా చర్యలు తీసుకుంటున్నట్లు ప్రకటించారు. పొగాకు రైతుల సమస్యలను పరిష్కరించేందుకు కేంద్రంతో చర్చిస్తున్నట్లు తెలిపారు. బేస్తవారిపేటకు రోడ్డును నాలుగు లైన్లుగా విస్తరించేలా చర్యలు తీసుకుంటామని, రహదారులు, రైల్వే ప్రాజెక్టుల విషయంలో కేంద్ర సహకారం కోరుతున్నామని చెప్పారు. పామూరులో ట్రిబుల్ ఐటీ ఏర్పాటు చేసేందుకు గతంలో టిడిపి ప్రభుత్వంలో నిర్ణయం తీసుకోవడం జరిగిందని, ఆ నిర్ణయానికి నేడు కూడా కట్టుబడి ఉన్నట్లు మంత్రి ఈ సందర్భంగా స్పష్టం చేశారు. వెనుకబాటు నుంచి అభివృద్ధి దిశగా పయనిస్తున్న జిల్లాను మరింత వేగంగా ముందుకు తీసుకువెళ్తామని చెప్పారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ సహజ, మానవ వనరులను సద్వినియోగం చేసుకుంటూ వెనుకబాటును అధిగమించి అభివృద్ధి చెందిన జిల్లాగా ఆవిష్కృతమయ్యేలా అధికార యంత్రాంగం దృష్టి సారించింది అన్నారు. ఈ ఏడాది వెలుగొండ నీళ్లు వస్తాయన్నారు. రెండు లక్షల మెట్రిక్ టన్నుల సామర్థ్యంతో వచ్చే నౌకలను ఆపరేట్ చేసే స్థాయిలో రామాయపట్నం పోర్టు అందుబాటులోకి రానున్నదని, బీపీసీఎల్, ఇండోసోల్, ఆక్వా, గెలాక్సీ గ్రానైట్ వంటి పరిశ్రమలు జిల్లాకు వన్నె తెస్తున్నాయన్నారు. హార్టికల్చర్ హబ్ గా కూడా జిల్లా మారుతుందన్నారు. వీటి ద్వారా విస్తృతంగా ఉపాధి అవకాశాలు లభించడంతో పాటు స్వాతంత్ర సమరయోధుల ఆకాంక్షలకు అనుగుణంగా జిల్లాను అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తామన్నారు. ఎస్పీ మాట్లాడుతూ వివిధ రంగాల్లో మహనీయులను అందించిన ప్రకాశం జిల్లాలో విధులు నిర్వహించడం గర్వకారణంగా ఉందన్నారు. అన్నింటా జిల్లా ముందంజలో ఉండటంలో పోలీస్ శాఖ తరపున అవసరమైన పాత్ర పోషిస్తామన్నారు.

జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ సమగ్ర క్అభివృద్ధికి అవసరమైన అవకాశాలు జిల్లాలో పుష్కలంగా ఉన్నాయన్నారు. జిల్లాపై అవగాహన పెంచుకొని ఈ దిశగా తాను దృష్టి సారిస్తానన్నారు. మేయర్ గంగాడ సుజాత మాట్లాడుతూ ఘన వారసత్వం కలిగిన ప్రకాశం జిల్లా అభివృద్ధి విషయంలోనూ తనదైన గుర్తింపు సాధించే దిశగా పయనిస్తోందన్నారు. గ్రంధాలయ సంస్థ చైర్ పర్సన్ ముప్పవరపు సుచిత్ర మాట్లాడుతూ అధికారులు, ప్రజా ప్రతినిధులు సమిష్టిగా పనిచేస్తే రెట్టింపు అభివృద్ధి సాధించవచ్చన్నారు. సంతనూతలపాడు ఎమ్మెల్యే బి ఎన్ విజయ్ కుమార్ మాట్లాడుతూ మహనీయుల ఆశలను స్మరించుకుంటూ జిల్లా అభివృద్ధిలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. జిల్లాకు చెందిన వివిధ రంగాల్లోని ప్రముఖులను ఈ కార్యక్రమంలో సన్మానించారు. టంగుటూరి ప్రకాశం పంతులు ముని మనవళ్ళు అయిన హనుమంతరావు, సంతోష్, స్వాతంత్ర్య సమరయోధుల కుటుంబ సభ్యులు అయిన కరవది సుబ్బలక్ష్మి, గంగవరపు భాస్కరరావు, ప్రముఖ వైద్యులు, రెడ్ క్రాస్ జిల్లా మాజీ అధ్యక్షులు చలమయ్య, కవులు పాటిబండ్ల ఆనందరావు, పొన్నూరు వేంకట శ్రీనివాసరావు, సంపత్ కుమార్, నళిని ప్రియా, కూచిపూడి నృత్య శిక్షణ సంస్థ వ్యవస్థాపకురాలు శివకుమారి, టెన్నిస్ క్రీడాకారుడు చిరంజీవి సన్మానం పొందారు. జిల్లా విశిష్టతను తెలియజేసేలా ఈ సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. వివిధ అంశాలలో నిర్వహించిన పోటీల్లో విజేతలైన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో డీఆర్వో చిన ఓబులేసు, ఒంగోలు ఆర్డిఓ లక్ష్మీ ప్రసన్న, పొగాకు ఉత్పత్తిదారుల సహకార సమాఖ్య చైర్మన్ జయంతి బాబు, వివిధ శాఖల జిల్లా అధికారులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## బాల్య వివాహాలు చేస్తే జైలుకే
## మున్సిపల్ చైర్మన్ షేక్ అబ్దుల్ గఫార్




(షణ్ముఖ వెలుగు, కనిగిరి రూరల్, ఫిబ్రవరి 2)

బాల్య వివాహాల పట్ల అవగాహన కార్యక్రమంలో భాగంగా సోమవారం కనిగిరి పట్టణంలోని చింతలపాలెం హైస్కూల్ విద్యార్థిని విద్యార్థులకు మండల న్యాయ సేవాధికార సంస్థ, సమగ్ర శిక్షా అభియాన్, గుడ్ హెల్ప్ ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో బాల్యవివాహాల వల్ల జరిగే అనర్థాల గురించి వివరించారు. ఈ సందర్భంగా కనిగిరి మున్సిపల్ చైర్మన్ న్యాయవాది షేక్ అబ్దుల్ గఫార్ మాట్లాడుతూ బాల్య వివాహాలు నిర్మూలించేందుకు ప్రతి ఒక్కరు కట్టుబడి పని చేయాలన్నారు. బాల్య వివాహాలు చేస్తే జైలుకే అని అన్నారు. బాల్య వివాహాల వల్ల బాలికల విద్య రక్షణ, ఆరోగ్యంతో పాటు వారి అభివృద్ధికి ఆటంకంగా కలుగుతుందని తెలిపారు. విద్యార్థి దశలో తాము కన్న కలలను సాకారం చేసుకునే అవకాశం కూడా వారికి దూరమవుతుందని తెలిపారు. ఎక్కడైనా బాల్యవివాహం జరుగుతున్నట్లు తెలిస్తే సంబంధిత గ్రామపంచాయతీలో గానీ, ఇతర ప్రభుత్వ అధికారులకు గానీ హెల్ప్ లైన్ టోల్ ఫ్రీ నెంబర్లు 1098, 100, 181, 112, 15100 కు గాని తెలియజేయాలని సూచించారు. బాల్య వివాహ నిషేధ చట్టం 2006 పై అవగాహన కలిగించి బాల్య వివాహాల వల్ల జరిగే అనర్థాలను తల్లిదండ్రులకు సైతం వివరించాలని పారా లీగల్ వాలెంటీర్, గుడ్ హెల్ప్ రమేష్ బాబు కోరారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు రామశర్మ, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

# మార్కాపురం జిల్లా సాధించినందుకు వైసీపీ నాయకులు తట్టుకోలేకపోతున్నారు

## మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి



(షణ్ముఖ వెలుగు, మార్కాపురం టౌన్, ఫిబ్రవరి 2)

మార్కాపురం జిల్లా సాధించినందుకు వైసీపీ నాయకులు తట్టుకోలేకపోతున్నారని మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. సోమవారం సాయంత్రం పట్టణంలోని 6వ వార్డులో ఏర్పాటు చేసిన మార్కాపురం జిల్లా ఇచ్చినందుకు కృతజ్ఞతగా నారా చంద్రబాబు నాయుడు చిత్రపటానికి పాలాభిషేకం కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రజలు ఎదురేగి పూలతో స్వాగతం పలికారు. అనంతరం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి మాట్లాడుతూ గత వైసిపి ప్రభుత్వంలో 63 రోజుల పాటు మార్కాపురం జిల్లాకు ప్రజల మద్దతుతో అనేక రకాలుగా నిరాహార దీక్షలు, రిలే నిరాహార దీక్షలు



చేశామని అయినా వైసీపీ నాయకులు మార్కాపురం జిల్లా ఇవ్వకుండా ఈ ప్రాంతాన్ని మోసం చేశారన్నారు. అనంతరం పుట్టినరోజు సందర్భంగా మార్కాపురం విచ్చేసిన మన ప్రియతమ నాయకులు నారా చంద్రబాబునాయుడు అధికారంలోకి వచ్చిన వెంటనే మార్కాపురం జిల్లా ప్రకటిస్తానని వాగ్దానం చేశారని, అధికారంలోకి వచ్చిన వెంటనే మార్కాపురం జిల్లాను ఏర్పాటు చేశారన్నారు. ఇప్పుడు మార్కాపురం జిల్లా ఏర్పడటంతో ఏమీ తోచక వైసిపి నాయకులు విమర్శలు చేస్తున్నారన్నారు. ప్రజలు దీనిని గమనించి వారికి బుద్ధి చెప్పాలన్నారు. ఈ మార్కాపురం పట్టణంను త్వరలోనే ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సకారంతో ఒక మహా పట్టణంగా అభివృద్ధి చేసి చూపిస్తానని, తద్వారా ఈ ప్రాంతం అన్ని రకాలుగా అభివృద్ధి చెందుతుందన్నారు. ఇక మిగిలిన వెలుగొండ ప్రాజెక్టును త్వరలోనే పూర్తి చేసి ఈ ప్రాంత రైతుల కళ్ళల్లో ఆనందం చూస్తానని అన్నారు. మార్కాపురం నియోజకవర్గానికి ఏది చేసిన తానే చేశానని మార్కాపురం జిల్లా సాధన, మార్కాపురం జిల్లా ఆసుపత్రి, మార్కాపురం పట్టణానికి రూ.42 కోట్లతో ఇంటి ఇంటికి పైపులైన్ వంటి ఎన్నో పనులు సాధించానని గర్వంగా చెప్పుకోగలనన్నారు. కానీ ఒక్క వైసీపీ నాయకుడు అన్న ఈ ప్రాంతానికి ఏం చేశారో చెప్పాలని సవాల్ విసిరారు. త్వరలోనే మార్కాపురం మెడికల్ కాలేజీని పూర్తి చేస్తామని, తద్వారా ఈ ప్రాంతం మరింత అభివృద్ధి చెందుతుందన్నారు. మార్కాపురం జిల్లా ఇచ్చినందుకు కృతజ్ఞతగా 6వ వార్డు మహిళలు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, 6వ వార్డ్ నాయకులు, మహిళలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

## ఎమ్మెల్యే కందుల ఆదేశాలతో బూత్ కన్వీనర్ కొండయ్య

### సొంత నిధులతో ట్యాంకర్ల ద్వారా నీరు సరఫరా



(షణ్ముఖ వెలుగు, పొదిలి, ఫిబ్రవరి 2)

పొదిలి నగర పంచాయతీ పరిధిలో బూత్ నెంబర్ 229 కన్వీనర్గా నూతనంగా కొండయ్య బాధ్యతలు చేపట్టారు. వెంటనే పదో వార్డులో నీటి కోసం ఇబ్బంది పడుతున్న ప్రజల కోసం మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి ఆదేశాల మేరకు సొంత నిధులతో ట్యాంకర్ల ద్వారా నీటిని అందజేశారు. ఇక నుంచి ప్రతి నిత్యం రెండు ట్యాంకర్ల ద్వారా పదో వార్డు ప్రజలకు నీటి సరఫరా చేస్తానని కొండయ్య మీడియాకు తెలిపారు. తన పై ఎంతో నమ్మకంతో బూత్ కన్వీనర్ బాధ్యతను అప్పగించిన మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి, యువనేత కందుల విగ్నేష్ రెడ్డికి హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. వారి నమ్మకాన్న తాను వమ్ము చేయనని పేర్కొన్నారు.

## సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలనే లక్ష్యంతో మీ కోసం కార్యక్రమం

### నిర్వహించిన మార్కాపురం జిల్లా పోలీసులు
### పబ్లిక్ గ్రీవెన్స్ రిడ్రెస్సల్ (మీ కోసం) కార్యక్రమంకు 43 ఫిర్యాదులు




(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, మార్కాపురం, ఫిబ్రవరి 2)

ప్రజల నుండి వచ్చే వివిధ రకాల ఫిర్యాదులను పరిష్కారించుటయే లక్ష్యంగా జిల్లా ఇన్చార్జ్ ఎస్పీ వి హర్షవర్ధన్ రాజు ఆదేశాల మేరకు మార్కాపురం డిఎస్పీ యు నాగరాజు, పోలీస్ అధికారులు సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో "మీకోసం" కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమం ద్వారా జిల్లాలో పలు ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదులను పోలీస్ అధికారులు స్వీకరించి వారితో మాట్లాడి వారి ఫిర్యాదుల గురించి సవివరంగా అడిగి తెలుసుకున్నారు. అందిన ప్రతి ఫిర్యాదు పై చట్ట ప్రకారం విచారణ జరిపి, సత్వర పరిష్కారం కల్పిస్తామని బాధితులకు భరోసా కల్పించారు. అదేవిధంగా అందిన ఫిర్యాదుల వివరాలను సంబందిత పోలీస్ స్టేషన్ అధికారులకు తెలియజేసి, త్వరితగతిన చట్ట ప్రకారం విచారణ జరిపి భాదితులకు న్యాయం అందించేలా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానంగా భూ వివాదాలు, ఉద్యోగ మోసాలు, కుటుంబ కలహాలు, ఆర్థిక మోసాలు, చీటింగ్ కేసులు మరియు ఇతర సమస్యలపై ప్రజలు ఫిర్యాదులు చేశారు. ప్రజల విశ్వాసం పెంపొందించడమే కాకుండా బాధితులకు తక్షణ సహాయం అందించడం పోలీస్ శాఖ ప్రధాన ధ్యేయమని అధికారులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మార్కాపురం సిఐ సుబ్బారావు, పొదిలి సీఐ యం రాజేష్ కుమార్, పామూరు సిఐ శ్రీనివాసరావు, గిద్దలూరు అర్బన్ సిఐ సురేష్, సిబ్బంది పాల్గొన్నారు.

## షేక్ కరిముల్లాను పరామర్శించిన గూడూరి ఎరిక్షన్ బాబు



(షణ్ముఖ వెలుగు, యర్రగొండపాలెం, ఫిబ్రవరి 2)


యర్రగొండపాలెం పట్టణంలో టీడీపీ కార్యకర్త షేక్ అల్లా మాలిక్ సోదరులు షేక్ కరిముల్లా (ముబారక్ బోర్ వేల్స్) ఇటీవల అనారోగ్యానికి గురై విజయవాడలో చికిత్స పొంది తన నివాసంలో కోలుకుంటున్న సందర్భంగా వారిని పరామర్శించిన యర్రగొండపాలెం నియోజకవర్గ టీడీపీ ఇంచార్జి గూడూరి ఎరిక్షన్ బాబు, యర్రగొండపాలెం మార్కెట్ యార్డ్ ఛైర్మెన్ చేకూరి సుబ్బారావు, యర్రగొండపాలెం మండల టీడీపీ అధ్యక్షులు చిట్యాల వెంగళరెడ్డి, బోగోలు సుబ్బారెడ్డి(రెంటపల్లి), వేగినాటి ఆత్మానంద శ్రీనివాస్, మాజీ సర్పంచ్ సత్యనారాయణ గౌడ్, తోట మహేష్ నాయుడు, మస్తాన్ వలి(మార్క్స్), షేక్ ఇస్మాయిల్, కందుల నారాయణరెడ్డి, పేరం రమణారెడ్డి, పలువురు టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

# ప్రతి ఇంటి నుంచి చెత్త సేకరణ తప్పనిసరి

## జిల్లా కలెక్టర్ వినోద్ కుమార్ ఆదేశాలు



(షణ్ముఖ వెలుగు, బాపట్ల, ఫిబ్రవరి 2)
పంచాయతీల్లో ప్రతి ఇంటి నుంచి తప్పనిసరిగా చెత్త సేకరణ జరగాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ వి వినోద్ కుమార్ అధికారులను ఆదేశించారు. గ్రామాల్లో పరిశుభ్రత లోపిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలోని మినీ వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో పంచాయతీ, మున్సిపల్ రంగాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. పంచాయతీ సెక్రటరీలు సెలవుల్లో ఉన్నప్పుడు పనులు నిలిచిపోకుండా ప్రత్యామ్నాయంగా మరో అధికారిని వెంటనే నియమించాలని సూచించారు. మండలాల వారిగా కనీసం 75 శాతం చెత్త సేకరణ జరగాలని, త్వరలోనే వంద శాతం లక్ష్యాన్ని సాధించేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. వేమూరు మండలం పెనుమర్రు పంచాయతీలో చెత్త సేకరణ సరిగా జరగకపోవడంపై కలెక్టర్ అసహనం వ్యక్తం చేశారు. నిర్లక్ష్యం కనిపిస్తే సహించేది లేదని స్పష్టం చేశారు. జిల్లాలో జలజీవన్ మిషన్ పనులను పూర్తి చేసి ప్రతి గ్రామంలో తాగునీటి సరఫరా వంద శాతం అమలు చేయాలని ఆదేశించారు. నీటి ట్యాంకులను క్రమం తప్పకుండా శుభ్రపరచాలని, ఈ విషయంలో ఎలాంటి నిర్లక్ష్యం తగదన్నారు. స్వామిత్వ సర్వే, ప్రాపర్టీ ట్యాక్స్ వసూళ్లను పెండింగ్ లేకుండా పూర్తి చేయాలని, ట్రేడ్ లైసెన్సుల వసూళ్లలో జాప్యం తగదన్నారు. రేపల్లె పట్టణంలో ట్రేడ్ లైసెన్సుల వసూళ్లు సరిగా లేకపోవడంపై ఎంపిడివోపై కలెక్టర్ అసంతృప్తి వ్యక్తం చేశారు. కర్లపాలెం మండలంలో షాపింగ్ ట్యాక్సీల వసూళ్లు వెంటనే ప్రారంభించాలని ఆదేశించారు. జిల్లాలో పెండింగ్‌లో ఉన్న పీఎంజేవీవై పనులను వేగవంతం చేసి త్వరితగతిన పూర్తి చేయాలని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో డీపీఓ ప్రభాకర్‌రావు, డీఆర్డిఏ పీడీ సింగయ్య, ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ అనంతరాజు, మున్సిపల్ కమిషనర్లు, ఎంపిడివోలు, డిప్యూటీ ఎంపిడివోలు హైబ్రిడ్ విధానంలో పాల్గొన్నారు.




# శక్తి యాప్ పై అవగాహన కార్యక్రమం



(షణ్ముఖ వెలుగు, చిన్నగంజాం, ఫిబ్రవరి 2)
అత్యవసర సమయంలో మహిళలకు తక్షణ సహాయం పొందేందుకు శక్తి యాప్ ఎంతగానో ఉపయోగపడుతుందని శక్తి టీమ్ ఎస్ఐ ఏ హరిబాబు అన్నారు. ఇంకోల్లు మండలంలోని ఆదర్శ స్కూల్ నందు సోమవారం ఇంకొల్లు ఎస్ఐ సురేష్, చీరాల సబ్ డివిజన్ శక్తి బృందం ఎస్ఐ ఏ హరిబాబు అధ్వర్యంలో విద్యార్థిని విద్యార్థులకు శక్తి యాప్ పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఇ సందర్భంగా శక్తి బృందం ఎస్ఐ ఏ హరిబాబు శక్తి యాప్ గురించి వివరిస్తూ ఈ యొక్క యాప్ అత్యవసర సమయంలో మహిళలకు తక్షణ సహాయం పొందేందుకు ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. అలాగే ఈవ్ టీజింగ్, బాల్య వివాహాలు అరికట్టే విధంగా ఈ యొక్క యాప్ ఏంతో ఉపయోగపడుతుందని వివరించారు. ఇంకోల్లు ఎస్ఐ సురేష్ మాట్లాడుతూ గుడ్ టచ్, బ్యాడ్ టచ్ గురించి వివరించి తెలియజేస్తూ అలా మనల్ని ఎవరైనా ఇబ్బంది పెడితే వెంటనే మన తల్లిదండ్రులకు, మీరు చదువుకునే పాఠశాల గురువులకు చెప్పాలని కోరారు. రోజురోజుకు పెరుగుతున్నటువంటి సైబర్ నేరాల నేపథ్యంలో విద్యార్థులకు సోషల్ మీడియాలో ఫేస్బుక్, ఇన్‌స్టాగ్రామ్‌లలో వచ్చే ఫేక్ న్యూస్‌లతో అప్రమత్తంగా ఉండాలని అవగాహన కల్పించారు. ఫోక్సో చట్టంపై అనగా చిన్న పిల్లల పై లైంగిక వేధింపుల చట్టం గురించి, మహిళల రక్షణ కోసం సెల్ఫ్ డిఫెన్స్ పై అవగాహనను కల్పించారు. ఈ కార్యక్రమంలో ఇంకొల్లు ఎస్ఐ సురేష్, కానిస్టేబుల్ సుబ్బారావు, శక్తి టీమ్ ఎస్ఐ ఏ హరిబాబు, పిసికే సుబ్బారావు, పాఠశాల కరస్పాండెంట్ తోటకూర విజయభాస్కర్, సునీత, పాఠశాల ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



# ముఖ్యమంత్రి చంద్రబాబు పై అంబటి అనుచిత వ్యాఖ్యలకు నిరసనగా దిష్టి బొమ్మ దహనం



(షణ్ముఖ వెలుగు, ఉలవపాడు, ఫిబ్రవరి 02)
ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పై మాజీ మంత్రి అంబటి రాంబాబు వ్యాఖ్యలకు నిరసనగా కరేడు గ్రామంలో ఎన్టీఆర్ విగ్రహం నందు కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు ఆదేశాల మేరకు కరేడు గ్రామ పార్టీ అధ్యక్షుడు నేలటూరి ఆదాము ఆధ్వర్యంలో అంబటి రాంబాబు దిష్టి బొమ్మ దహనం చేశారు. ఈ సందర్భంగా స్థానిక నాయకులు మాట్లాడుతూ వైకాపా నేతల భాష సభ్య సమాజం తలదించుకునేలా ఉందన్నారు. దశాబ్దాల రాజకీయ అనుభవం కలిగిన నాయకుడు నారా చంద్రబాబు నాయుడు అని, అలాంటి వ్యక్తి పై అసభ్యకర వ్యాఖ్యలు చేయడాన్ని తెలుగుదేశం పార్టీ తీవ్రంగా ఖండిస్తుందన్నారు. అధికారం కోల్పోయిన ఆవేశంలో ప్రజా తీర్పును అగౌరవపరుస్తూ మాట్లాడడం ఆయన సంస్కారహీనతకు నిదర్శనమన్నారు. రాజకీయ విమర్శలు హద్దుల్లో ఉండాలని, వ్యక్తిగత దూషణలు ప్రజాస్వామ్యానికి ప్రమాదమని తెలిపారు. గతంలో ఇదే తీరుతో వైసీపీ ఘోర పరాజయం పాలైందని గుర్తుచేశారు. అంబటి తన వ్యాఖ్యలను వెంటనే వెనక్కి తీసుకొని బహిరంగంగా క్షమాపణ చెప్పాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ పార్టీ అధ్యక్షులు నేలటూరి ఆదాము, నీటి వినియోగదారుల సంఘం అధ్యక్షులు మెట్టా శ్రీనివాసులురెడ్డి, కన్నా ప్రసాదు, పామంజి పోలిశెట్టి, గొల్లపోతు రమణయ్య, గడ్డం నవీన్, మర్రిబోయిన వెంకయ్య, కరేటి గోపాల్, సంకే యేసురత్నం, డీలర్ శీను, జయరాం, తన్నీరు బ్రహ్మయ్య, పున్నేపల్లి చిన్న, గడ్డం గోపాల్, కరేటి శివరాం, పున్నేపల్లి శాంసన్, రామలింగం సురేష్, మక్కే మురళి, ఉప్పిరెట్ల రామారావు, కరేటి శ్రీనివాసులు, వెంకాయమ్మ, మేకనబోయిన జాలమ్మ, తదితరులు పాల్గొన్నారు.



# అల్లినగరంలో ప్రపంచ చిత్తడి నేలల దినోత్సవం



(షణ్ముఖ వెలుగు, గిద్దలూరు, ఫిబ్రవరి 2)
కొమరోలు మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల అల్లినగరంలో ప్రపంచ చిత్తడి నేలల దినోత్సవం సందర్భంగా నిర్వహించిన కార్యక్రమానికి ఇన్చార్జి ప్రధానోపాధ్యాయులు డాక్టర్ మొర్రి పిచ్చయ్య అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమంలో అటవీశాఖ డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ ఆనందరావు, ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ రాజేష్, అటవీశాఖ సిబ్బంది పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి కొమరోలు మండల విద్యాశాఖ అధికారి బొర్రా వెంకట రత్నం ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రభాకర్‌రావు మాట్లాడుతూ చిత్తడి నేలల ప్రాముఖ్యతను, అడవుల సంరక్షణ, జంతువుల సంరక్షణ, పర్యావరణ సంరక్షణ, గురించి విద్యార్థులకు తెలియజేశారు. గ్రామంలో పాఠశాల విద్యార్థుల చేత ర్యాలీ నిర్వహించి గ్రామస్తులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది జనార్ధన్ రాజు, హరికుమార్ చౌదరి, చంద్రమోహన్, ఆదిలక్ష్మి, కృష్ణమూర్తి, శ్రీనివాసులు ఫకీరయ్య, అశ్విని తదితరులు పాల్గొన్నారు.

# అయ్యప్ప స్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు



(షణ్ముఖ వెలుగు, బద్వేల్, ఫిబ్రవరి 2)
బద్వేల్ పట్టణంలోని నెల్లూరు రోడ్డులో వెలసిన శ్రీ శ్రీ హర హర పుత్ర అయ్యప్ప స్వామి దేవాలయంలో మాఘమాసం పురస్కరించుకొని సోమవారం వేద పండితులు ఆధ్వర్యంలో స్వామివారికి తెల్లవారుజాము నుండి వివిధ రకాల ప్రత్యేక పూజలను అంగరంగ వైభవంగా నిర్వహించారు, మాఘమాసం సందర్భంగా బద్వేల్ పట్టణ పరిసర ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తాదులందరూ అయ్యప్ప స్వామిని దర్శించుకొని కాయా కర్పూరం సమర్పించుకొని తమ మొక్కులను తీర్చుకున్నారు, అలాగే ప్రత్యేక ఉబయదాతగా మాజీ మార్కెట్ యార్డ్ డైరెక్టర్ పబ్బతి చంద్రశేఖర్ సతీమణి వసంతలక్ష్మి కుమార్తె పబ్బతి సుదీప్తి జన్మదినో త్సవం సందర్భంగా ప్రత్యేక ఉబయతలైన వారి కుటుంబ సభ్యులకు అయ్యప్ప స్వామి సన్నిధిలో ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామివారి తీర్థప్రసాదాలను అందజేశారు,అయ్యప్ప స్వామిని దర్శించుకున్న భక్తులు అందరికీ అయ్యప్ప స్వామి దేవాలయం చైర్మన్ సముద్రాల విజయ్ కుమార్, సెక్రటరీ, కమిటీ సభ్యులు ప్రత్యేక తీర్థ ప్రసాదాలను అందజేశారు.

# ఒకరు బదిలీ మరొకరు బాధ్యతల స్వీకరణ

### మండల తహశీల్దార్‌గా బాధ్యతలు చేపట్టిన విజయభాస్కర్



(షణ్ముఖ వెలుగు, త్రిపురాంతకం, ఫిబ్రవరి 2)
మండల తహసీల్దార్‌గా ఒకరు బదిలీ కాగా మరొకరు బాధ్యతలు చేపట్టారు. ఇప్పటి వరకు త్రిపురాంతకం తహసిల్దారుగా వ్యవహరించిన చీరాల కృష్ణమోహన్ ఒంగోలుకు బదిలీ అయ్యారు. యర్రగొండపాలెం డిప్యూటీ తహసీల్దార్‌గా బాధ్యతలు చేపట్టిన విజయ భాస్కర్ త్రిపురాంతకం తహసీల్దార్‌గా అదనపు బాధ్యతలు చేపట్టారు. కృషమోహన్ కు ఏర్పాటు చేసిన సన్మాన సభలో సిబ్బంది ఆయనను ద్దేశించి ఆయన పనితీరును కొనియాడారు. అనంతరం ఆయనను శాలువా, పూలమాలతో ఘనంగా సత్కరించారు. అనంతరం విజయభాస్కర్‌కు ఘన స్వాగతం పలుకుతూ పూలమాల, శాలువా వేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ కిరణ్, మండల సర్వేయర్ సైదారావు, ఆర్ఐ శ్రీనివాస్, విఆర్ఓ శివలింగయ్య, గురవరెడ్డి, కృష్ణరెడ్డి, వెంకట లక్ష్మి, రమ్యకృష్ణ, శ్రీదేవి, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

# అంబేద్కరిజం క్యాలండర్ ఆవిష్కరించిన మార్కాపురం జాయింట్ కలెక్టర్ పులి శ్రీనివాసులు

### రూపకర్త నీలంకు అభినందనలు



(షణ్ముఖ వెలుగు, మార్కాపురం టౌన్, ఫిబ్రవరి 2)
దళిత నేత నీలం నాగేంద్ర రూపొందించిన అంబేద్కరిజం కాలెండర్ ను మార్కాపురం జిల్లా జాయింట్ కలెక్టర్ పులి శ్రీనివాసులు సోమవారం తన ఛాంబర్ లో ఆవిష్కరించారు. అంబేద్కరిజం కాలెండర్ ప్రత్యేకత గురించి మార్కాపురం జిల్లా జాయింట్ కలెక్టర్ పులి శ్రీనివాసులుకు తేదీలు వాటి ప్రాముఖ్యత నెలల వారీగా వివరించారు. జనవరి ఒకటిన మహర్ సైనికుల విజయోచ్చావ దినం, అలాగే జనవరి మూడునా భారతీయ మొదటి మహిళా ఉపాధ్యాయురాలు సావిత్రిభాయ్ పూలె జయంతి, జనవరి 13 విరసం నేత కళ్యాణ్ రావు అంటరానివాసంతం ఆవిష్కరణ, జనవరి 26 అంబేద్కర్ రిపబ్లిక్ డే అని జాయింట్ కలెక్టర్ కు వివరించారు. ఫిబ్రవరి నెలలో 14 తేదీన ఆంధ్రప్రదేశ్ ఏకైక దళిత ముఖ్యమంత్రి దామోదరం సంజీవయ్య జయంతి, మార్చ్ 15 న బహుజన రాజ్యాధికార దాసినికుడు అంబేద్కర్ కలలపంట కాన్షిరాం జయంతి 16 వ తేదీ మహాద్ చెరువు పోరాటం, ఏప్రిల్ 11న మహాత్మ జ్యోతి రావ్ పూలే జయంతి, ఏప్రిల్ 17 న పీపుల్స్ వార్ వ్యవస్థాపకులు విప్లవ మూర్తి సత్యమూర్తి అలియాస్ శివసాగర్ వర్ధంతి తేదీల ప్రాముఖ్యత విశిష్టతల గురించి జాయింట్ కలెక్టర్ కు తెలిపారు. మే 27 న అంబేద్కర్ సతీమణి రామబాయ్ వర్ధంతి, జూన్ 10వ తేదీ మానవహక్కుల యోధుడు బాలాగోపాల్ జయింతి, జూన్ 12 న లక్ష్మి పేట దళితుల మరణకాండ, మరియు జూన్ 29 అంబేద్కర్ గురువు అయినా కబీర్ జయంతి, జూలై 17 భారతదేశ దళిత ఆత్మగౌరవ పోరాట పోలికేక కరెంచేడు మారానకాండ సంఘటన గాయలను, గేయాలను కుడా జాయింట్ కలెక్టర్ పులి శ్రీనివాసులు కు నీలం విశదీకరించారు. అలాగే ఆగస్టు 6 న దళితులకు వజ్రయుదుమైన ఒ,ఎ, ర్ యాక్ట్ ను తెచ్చిన చుండూరు నరమేధం రక్తగీతం గురించి సోదాహరణంగా జాయింట్ కలెక్టర్ కు నీలం తెలిపారు. ఆగస్టు 17 న కమ్యూనల్ అవార్డు ప్రకటన 26 తేదీన నారాయణ గురు జయంతి వాటి నేపథ్యం గురించి తెలిపారు. సెప్టెంబర్ లో 28 మహాకవి గుర్రం జాషువా, 29 దళిత తిరుగుబాటు పైడి తేరేష్ బాబు మరణం గురించి తెలిపారు, అక్టోబర్ 14 న అంబేద్కర్ భౌద్ధ ధర్మ స్వీకారం గురించి, నవంబర్ 30 తేదీన బ్రిటిష్ కౌన్సిల్ లో అంబేద్కర్ కార్మిక శాఖ మంత్రిగా నియమించిన వైనాన్ని గూర్చి సవివరంగా తెలిపారు. డిశంబర్ 22 తారీఖున దళిత సమైక్యవాది పీవి రావ్ వర్ధంతి అలాగే డిశంబర్ 25 ఏళ్లుగా కొనసాగుతున్న మనుస్మృతిని అంటరాని కులాల సూరీడు అంబేద్కర్ దహనం చేసిన రోజు అని చారిత్రక ఆధారాలతో దళిత జాతి విముక్తి పోరాటల గాధలు జాయింట్ కలెక్టర్ కు నీలం ఉదాహరించారు. దళిత ఉద్యమ సజీవ చరిత్ర ను కాలగమనిగ మార్చిన దళిత నేత నీలం నాగేంద్ర ను మార్కాపురం జిల్లా జాయింట్ కలెక్టర్ పులి శ్రీనివాసులు అభినందించారు. ఈ కార్యక్రమంలో దళిత సంఘాల ఐక్య వేదిక జిల్లా కన్వీనర్ పత్రా బంగారం, మాల మహానాడు జిల్లా అధ్యక్షులు దారా అంజయ్య, కార్యదర్శి కాకుమాను రవి, మేడికొండ మురళి, చేబ్రోలు సృజన్ రాజ్, న్యాయవాది, విసికె పార్టీ జిల్లా కన్వీనర్ నూతలపాటి రాజు, పాల్గొన్నారు.

# నాలుగు లేబర్ కోడ్‌లు రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఫిబ్రవరి 12న దేశవ్యాప్తంగా జరుగు సార్వత్రిక సమ్మె జయప్రదం చేయండి

(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, ఫిబ్రవరి 2)




కార్మిక వర్గం పోరాడి సాధించుకున్న 44 కార్మిక చట్టాలను రద్దుచేసి కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్ లు రద్దు చేయాలని,డిమాండ్ చేస్తూ ఫిబ్రవరి 12వ తేదీ జరుగు దేశ వ్యాప్త సార్వత్రిక సమ్మె జయప్రదం చేయాలని ఐయఫ్ టి యు రాష్ట్ర ఉపాధ్యక్షులు ఆర్,మోహన్ కార్మిక వర్గానికి పిలుపునిచ్చారు. సోమవారం ఒంగోలులోని కామ్రేడ్ మాదాల నారాయణస్వామి స్మారక భవన్లో ఐఎఫ్‌టియు జిల్లా కమిటీ ఆధ్వర్యంలో సార్వత్రిక సమ్మె పోస్టర్ ఆవిష్కరణ జరిగింది. ఈ సందర్భంగా కామ్రేడ్ ఆర్ మోహన్ మాట్లాడుతూ కార్మిక వర్గం తమ రక్తతర్పణలతో, త్యాగాలతో పోరాడి సాధించుకున్నహక్కులు, చట్టాలను ఫాసిస్ట్ మోడీ ప్రభుత్వం రద్దుచేసి వాటి స్థానంలో తీసుకువచ్చిన నాలుగు లేబర్ కోడ్ లు రద్దు చేయాలని కోరుతూ ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ తీర్మానం చేసి కేంద్రానికి పంపాలని, కార్మికుల కనీస వేతనం 36,000 అమలు చేయాలని, కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ విధానాలను నిలిపివేయాలని, భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డు పునరుద్ధరించాలని, ఆటో, రవాణా రంగ కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని, భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ పథకాలను అమలు చేయాలని, భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డు నిధులను తిరిగి జమ చేయాలని, భవన నిర్మాణ కార్మికుల పెండింగ్ క్లెయిములు వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఇటీవల సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి దేశంలోపారిశ్రామిక అభివృద్ధికి కార్మిక సంఘాలు ఆటంకంగా ఉన్నాయని చేసిన వ్యాఖ్యలను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఐయఫ్‌టియు జిల్లా అధ్యక్షులు సిహెచ్ రంగారావు మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్‌లో చంద్రబాబు నాయుడు కూటమి ప్రభుత్వం కూడా కేంద్రం అడుగుజాడల్లో నడుస్తూ కార్మిక వర్గంపై దాడి చేస్తున్నారని, అలాగే కేంద్రంలోని మోడీ ప్రభుత్వం అత్యంత దుర్మార్గంగా గ్రామీణ పేదలకు ఉపాధి కల్పిస్తున్న మహాత్మా గాంధీ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని రద్దు చేశారన్నారు. నిధులు, హక్కులు లేని వికసిత్ భారత్ జి రాంజీ పథకాన్ని తీసుకొచ్చిందని, వికసిత్ భారత్ జీ రాంజీ పథకాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఇంకా ఈ కార్యక్రమంలో ఐయఫ్‌టియు జిల్లా కార్యదర్శి టి వెంకట్రావు, జిల్లా కోశాధికారి సిహెచ్ మోజెస్, జిల్లా నాయకులు రామకృష్ణ, నరసింహరావు, సిహెచ్ తిరుమలరావు, తదితరులు పాల్గొన్నారు.

## తిరుపతి లడ్డుపై అసత్య ప్రచారలను మానుకోవాలి


### మాజీ ఎమ్మెల్యేలు అన్నా, జంకే



(షణ్ముఖ వెలుగు, మార్కాపురం, ఫిబ్రవరి 2)

తిరుపతి లడ్డు ప్రసాదం పై అసత్య ప్రచారాలు చేస్తున్న కూటమినేతలకు మంచి బుద్ధి ప్రసాదించాలని గిద్దలూరు మాజీ ఎమ్మెల్యే, మార్కాపురం నియోజకవర్గ వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ సమన్వయకర్త అన్నా రాంబాబు ఆధ్వర్యంలో స్థానిక మార్కాపురం పట్టణంలోని శ్రీవెంకటేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. విష ప్రచారం ఇకనైనా ఆపాలని అన్నా రాంబాబు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా అన్నా రాంబాబు మాట్లాడుతూ ముఖ్యమంత్రి స్థానంలో ఉన్న చంద్రబాబు కోట్లాది మంది ఆరాధ్యంగా భావించే వెంకటేశ్వరస్వామి ప్రసాదం గురించి నోటికొచ్చినట్లు విమర్శలు చేశారు. కనీస అవగాహన లేకుండా వైయస్ఆర్ సీపీ పై అబద్ధాలు ప్రచారం చేయాలనే ఉద్దేశంతో జంతువుల కొవ్వు కలిసిందని మాట్లాడారు. రాజకీయాల కోసం దేవుడిని కూడా వాడుకుని చంద్రబాబు దిగజారిపోయారు. కూటమి నేతలు బహిరంగ క్షమాపణలు చెప్పాలి. హిందుత్వంపై నమ్మకం ఉంటే చేసిన తప్పు సరిదిద్దుకోవాలి. రాజకీయ లబ్ధి కోసం జగన్ పై వైయస్ఆర్‌సీపీ పై బురద జల్లాలనుకున్నారు. పైన వెంకటేశ్వరస్వామి అన్ని చూస్తున్నాడు ఎవరిని వదలడు. ఇప్పుడు మొహం చూపించుకోలేక కూటమి నేతలు దాక్కొని తిరుగుతున్నారు. ఎల్లో మీడియాతో మళ్ళీ అబద్ధాలు ప్రచారం చేయించాలని చూస్తున్నారు. ప్రజల దగ్గరకు వచ్చి లెంపలు వేసుకొని, గుంజీలు తీసి క్షమాపణలు కోరాలన్నారు. భక్తులు స్వయంగా వచ్చి కూటమి నేతల తీరు పై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మళ్ళీ ఇలాంటి ప్రచారాలు చేయకూడదని డిమాండ్ చేస్తున్నారు. జగన్ హయాంలో అన్ని వర్గాల ప్రజలకు మంచి జరిగిందని, చంద్రబాబు గతంలో అభివృద్ధి పేరుతో అనేక గుడులు కూల్చేశారు. హిందువులు అంటే చంద్రబాబు, పవన్ కళ్యాణ్ కు గౌరవం లేదన్నారు. జంతువుల కొవ్వు కలిసింది అని సంవత్సరం పాటు అబద్ధపు ఆరోపణలు చేశారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఎస్పీని మర్యాదపూర్వకంగా కలిసిన ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు



(షణ్ముఖ వెలుగు, కందుకూరు, ఫిబ్రవరి 2)

ప్రకాశం జిల్లా ఎస్పీ హర్షవర్ధన్‌రాజుని కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు స్థానిక ఆర్అండ్‌బి గెస్ట్ హౌస్ లో సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. కందుకూరుకు వచ్చిన ఎస్పీకి పూల బుకేతో స్వాగతం పలికారు. కందుకూరు పట్టణంలో ట్రాఫిక్ సమస్య, అలాగే శాంతిభద్రతల పై కొద్దిసేపు ఇద్దరు చర్చించుకున్నారు.

## రాష్ట్ర అభివృద్ధికి ఊతమిచ్చేలా కేంద్ర ప్రభుత్వ బడ్జెట్

### యాగంటి



(షణ్ముఖ వెలుగు, మాచర్ల టౌన్, ఫిబ్రవరి 2)

కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్లో మన రాష్ట్రానికి ఆర్థిక వ్యవస్థకు మద్దతు ఇచ్చేలాగా ఉందని వెల్లడించారు నూతనంగా ఏర్పడిన మన రాష్ట్రానికి ఇబ్బందికరంగా ఉన్న రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని గమనించి రాష్ట్రానికి అవసరమైన రెండు ప్రధాన ప్రాజెక్టులు అవసరాలను గుర్తించి ఈ బడ్జెట్లో పోలవరం ప్రాజెక్టుకు రూ.3,320 కోట్లు అలాగే ప్రజా రాజధాని అమరావతి నిర్మాణానికి రూ.1128 కోట్లు కేటాయించి రాష్ట్రం మీద ఉన్న అభిమానాన్ని కేంద్ర ప్రభుత్వం చాటుతుందని వెల్లడించారు.అలాగే రాష్ట్రంలో ఉన్న రోడ్లకు త్రాగునీరుకు, వ్యవసాయ రంగానికి భారీగా నిధులు కేటాయించిందని ఆనంద వ్యక్తం చేశారు. పల్నాడు ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, మాచర్ల నియోజకవర్గ ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి కృషితో పల్నాడు ప్రజల జీవనోదారమైన వరికాపూడిసెల లిఫ్ట్ ఇరిగేషన్‌ను కేంద్ర ప్రభుత్వం పథకం అయినా పూర్వోదయ పథకం పరిధిలోకి చేర్చినందుకు నిధులు కొరత ఉండదని మిగతా అనుమతులు కూడా లాంచనమే అని అన్నారు. తొందరలో ఈ పథకం ద్వారా వరికాపూడిసెల ప్రాజెక్టు పరుగులు పెడుతుందని, దాదాపు 85 వేల ఎకరాలకు సాగునీరు, పల్నాడు ప్రజలకు త్రాగునీరు అందుతుందని హర్షం వ్యక్తం చేశారు. అలాగే ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి ఇప్పటికే దేవాలయాలకు, రోడ్ల నిర్మాణానికి, త్రాగునీటికి భారీ ఎత్తున నిధులు సేకరించి మాచర్ల నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్నారన్నారు. కేంద్ర ప్రభుత్వ పథకమైన అమృత పథకం ద్వారా ఇంటింటికి త్రాగునీరు సదుపాయం తొందరలో అందుతుందని మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ యాగంటి మల్లికార్జునరావు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## అంగన్వాడి కేంద్రాలకు బాపట్ల సేవా సేతు ద్వారా తల్లి ప్రేమను అనుసంధానించాలి

### జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్



(షణ్ముఖ వెలుగు, బాపట్ల, ఫిబ్రవరి 2)

అంగన్వాడి కేంద్రాలకు బాపట్ల సేవా సేతు ద్వారా తల్లి ప్రేమను అనుసంధానించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్.వి, తెలిపారు. బాపట్ల సేవా సేతు ద్వారా అంగన్వాడి కేంద్రాలలో మౌలిక సదుపాయాల కల్పనపై మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారులతో సోమవారం స్థానిక కలెక్టరేట్ లో ఆయన సమావేశం నిర్వహించారు. బాపట్ల సేవా సేతు ద్వారా అంగన్వాడీ కేంద్రాలలో చిన్నారులకు మెరుగైన సేవలు అందించడమే లక్ష్యమని కలెక్టర్ చెప్పారు. జిల్లాలో 1,552 అంగన్వాడీ కేంద్రాలు ఉండగా, పూర్తి సౌకర్యాలు కల్పించాలన్నారు. దాతలు అందించే విరాళాలను సద్వినియోగం చేసుకోవడానికి వేదిక ఏర్పాటు చేశామన్నారు. అంగన్వాడి కేంద్రాలలో ఉండే ఆరేళ్లలో చిన్నారులకు తల్లి ప్రేమ అందించేలా ప్రక్రియను ప్రారంభించామన్నారు. ఆయా కేంద్రాలలో ఏ అవసరాలు ఉన్నాయో, వాటన్నిటిని పరిష్కరించడానికి వివరాలను నిక్షిప్తం చేయాలన్నారు. విరాళాల రూపంలో దాతలు ఇచ్చిన వస్తువులకు ధ్రువీకరణ పత్రాలు సమంత శాఖ అధికారులు ఇవ్వాల్సి ఉందన్నారు.



కేంద్రాలకు అవసరమైనవన్నీ వెబ్ సైట్ లో పొందుపరచడానికి అంగన్వాడి సూపర్వైజర్లు, సిడిపివోలకు లాగిన్ లు ఇస్తామన్నారు. పూర్తి వివరాలను పొందుపరచాలన్నారు. పేదలకు బహుళ ప్రయోజనం కల్పించేలా రూపొందించిన వెబ్ సైట్ ను జయప్రదంగా ముందుకు తీసుకెళ్లడానికి సహకరించాలన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి ఏర్పాటు చేసిన పి4 స్ఫూర్తితో బాపట్ల సేవా సైతం ఏర్పాటు చేశామన్నారు. ఈ సమావేశంలో మహిళ శిశు సంక్షేమ శాఖ పిడి రాధ మాధవి, ఐసిడిఎస్ సిడిపివోలు, సూపర్వైజర్లు, తదితరులు పాల్గొన్నారు.

## 1, 2 డివిజన్‌ల కన్వీనర్ గా యలమర్తి మను బ్రహ్మాచార్యులు


(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, ఫిబ్రవరి 2)



ప్రకాశం జిల్లా విశ్వబ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు పులివర్తి సాయిబాబు సూచనల మేరకు ఒంగోలు నగర విశ్వబ్రాహ్మణ సంఘం అధ్యక్షులు మానేపల్లి గోవిందాచార్యులు, గౌరవాధ్యక్షులు పోతులూరి శివబ్రహ్మాచార్యులు అధ్యక్షతన ఒకటి, రెండు డివిజన్లలో ఉన్న విశ్వబ్రాహ్మణ సంఘీయులకు సేవచేసేందుకు యలమర్తి మను బ్రహ్మాచార్యులు ని కన్వీనర్ గా నియమించడం జరిగింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న వారు ప్రధాన కార్యదర్శి కందుకూరి దక్షిణామూర్తి, కోశాధికారి కొత్తపల్లి సాయిబాబు, కార్యనిర్వాహక అధ్యక్షులు చోడ కోటేశ్వరరావు, ఉపాధ్యక్షులు పూసపాటి నాగేంద్ర, సాయిబాబు, కందుకూరి మాధవాచార్యులు, కుందుర్తి ఆంజనేయులు, ఆదిమూలం రమేష్, కొండముది సుబ్రమణ్యం, తదితర విశ్వబ్రాహ్మణ సంఘీయులు పాల్గొన్నారు. సహకరించిన వారికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియచేసారు.

కరెంటు షాక్ బాధిత కుటుంబానికి

## అన్నా మిత్రమండలి ఆధ్వర్యంలో రూ.1.20 లక్షల ఆర్థిక సాయం అందజేత



(షణ్ముఖ వెలుగు, గిద్దలూరు, ఫిబ్రవరి 2)

గిద్దలూరు మాజీ ఎమ్మెల్యే, మార్కాపురం నియోజకవర్గ వైసీపీ ఇన్చార్జ్ అన్నా రాంబాబు ఆదేశాల మేరకు మార్కాపురం పట్టణంలోని కరెంట్ ఆఫీస్ వెనుక కరెంటు షాక్ తగిలిన షేక్ నిజాముద్దీన్ కుమారుడు షేక్ ఖాసీం వలి కుటుంబానికి అన్నా మిత్రమండలి ఆధ్వర్యంలో రూ.1.20 లక్షల ఆర్థిక సహాయం అందజేశారు. అనంతరం గుంటూరు హాస్పిటల్‌లో చికిత్స చేయించుకుంటున్న షేక్ ఖాసీం వలి ని కలిసి వారి యోగ క్షేమాలు తెలుసుకుని, చికిత్స గురించి డాక్టర్‌తో చర్చించి బాధిత కుటుంబానికి రూ.1.20వేలు ఆర్థిక సహాయం అందజేశారు. గుంటూరుకు వెళ్లి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధిత కుటుంబాన్ని కలిసిన వారిలో అన్నా మిత్రమండలి మార్కాపురం మైనార్టీ నాయకులు వార్డెన్ నజీర్ సార్, షేక్ ఖాసిం వలి, 18వ బ్లాక్ ఇన్చార్జి సయ్యద్ గఫూర్, మార్కాపురం వైస్ ప్రెసిడెంట్ షేక్ మహబూబ్ బాషా, సీఎం ఖాసీం, సీనియర్ నాయకులు, తదితరులు పాల్గొన్నారు. ఈ కుటుంబానికి ఇంకా ఎవరైనా దాతలు ఆర్థిక సహాయం చేయాలంటే ఈ ఫోన్ పే నెంబర్ 9966466012 కు చేయాలన్నారు.

## మంచినీటి పైపులైన్లను మార్చే కార్యక్రమం

### తాత్కాలికంగా నిలిపి వేత

### యధావిధిగానే ప్రజలకు మంచినీటి సరఫరా

### నగరపాలక కమిషనర్ కోడూరు వెంకటేశ్వరరావు

(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, ఫిబ్రవరి 2)



ఒంగోలు నగరపాలక సంస్థ పరిధిలోని రంగారాయుడు చెరువు వద్ద రోడ్డు విస్తరణ పనులు చేపట్టుచున్నందున అక్కడున్న మంచినీటి పైపులైన్లను మార్చవలసియున్నదని, అందుకు 03.02.2026 నుండి 05.02.2026 వరకు సంబంధిత ప్రాంతముల వారికి మంచినీటి సరఫరాలో అంతరాయము ఏర్పడునని ఈ కార్యాలయం నుండి 29.01.2026న పత్రికా ప్రకటన ద్వారా నగర ప్రజలకు తెలిపారు. కానీ కొన్ని అనివార్య కారణముల వలన అక్కడ మంచినీటి పైపులైన్లను మార్చవలసియున్న కార్యక్రమము తాత్కాలికంగా నిలిపివేయడమైనది. మరలా తదుపరి పత్రికా ప్రకటన ద్వారా పై విషయమును తెలియచేసి, అప్పుడు పైపులైన్లను మార్చే కార్యక్రమము చేపట్టబడును. ప్రస్తుతము యధావిధిగానే మంచినీటి సరఫరా జరుగుతుందన్నారు. నగర ప్రజలు పై విషయాలను గమనించి నగరపాలక సంస్థకు సహకరించవలసినదిగా కోరారు.

## ఈనారి వివోఏలకు అవగాహన



(షణ్ముఖ వెలుగు, ఉలవపాడు, ఫిబ్రవరి 2)
మండల కేంద్రమైన ఉలవపాడు వెలుగు ఆఫీస్ లో సోమవారం రోజున ఉలవపాడు ఎస్ఐ జి సుబ్బారావు ఈనారి వివోఏలతో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మహిళల చట్టాలు, శక్తి యాప్, సైబర్ నేరాలు, రోడ్డు భద్రత, మహిళలపై జరిగే నేరాలు, వాటి గురించి తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి అవగాహన కల్పించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఏపీఎం, ఇతర అధికారులు, మహిళా నాయకులు, సుమారు వంద మంది మహిళలు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంతో పాటు భీమవరం, కరేడు గ్రామాలలో జరిగిన సమావేశాల్లో కూడా పోలీస్ సిబ్బంది పాల్గొని అవగాహన కల్పించారు.

## సీఎం చంద్రబాబు పై అనుచిత వ్యాఖ్యలు చేసిన అంబటి రాంబాబుపై కేసు నమోదు చేయాలి

### అంబటి రాంబాబు పై పోలీసులకు ఫిర్యాదు చేసిన టీడీపీ నాయకులు





(షణ్ముఖ వెలుగు, కంభం, ఫిబ్రవరి 2)
మార్కాపురం జిల్లా కంభం మండలం తెలుగుదేశం పార్టీ కార్యాలయం నందు కంభం మండల టీడీపీ నాయకులు ప్రెస్ మీట్ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కంభం తెలుగుదేశం పార్టీ మండలం నాయకులు మాట్లాడుతూ సీఎం చంద్రబాబు పై అనుచిత వ్యాఖ్యలు చేసిన అంబటి రాంబాబుపై కేసు నమోదు చేయాలని, విజనరీ లీడర్ చంద్రబాబు, నారా లోకేష్ పై జుగుప్సాకర వ్యాఖ్యలు చేశారని, దీనిని తాము తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. రాష్ట్ర అభివృద్ధిని అడ్డుకోవడం కోసమే ఇటువంటి వ్యాఖ్యలు చేసి గందరగోళం సృష్టిస్తున్నారని, ఇటువంటి నీచ రాజకీయాలు మానుకోవాలని, వైసీపీ నేతల బూతు పురాణం చూసి ప్రజలు అసహ్యించుకుంటున్నారన్నారు. అమరావతి, పోలవరం, ప్రాజెక్టుల పురోగతి, రాష్ట్ర సమగ్రాభివృద్ధికి చర్యలు, ఉపాధి అవకాశాలకు భారీగా పెట్టుబడులు ఇవన్నీ చూసి వైసీపీ నేతలు తట్టుకోలేక పోతున్నారని, నారా లోకేష్ ని సీఎం చంద్రబాబు అత్యుత్తమంగా తీర్చిదిద్దారన్నారు. జోగి రమేష్ తన అవినీతి, అక్రమాలను తన కుమారునికి కూడా నేర్పి అతడిని ఓ నేరస్తునిగా మార్చాడన్నారు. ఇటువంటి వారికి ప్రజలే బుద్ధి చెబుతారు అని తీవ్రంగా ఖండించారు. ఈ కార్యక్రమంలో కంభం మండలం నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## పదో తరగతి విద్యార్థులకు ఆల్ ఇన్ వన్ పుస్తకాలు పంపిణీ

### దాత దాతృత్వం అభినందనీయం



(షణ్ముఖ వెలుగు, చిన్నగంజాం, ఫిబ్రవరి 2)
పది విద్యార్థులను ప్రోత్సహించడం, వారి చదువులో ఉన్నత లక్ష్యం చేరుకోవటం,మెరుగైన మార్కులు సాధనే లక్ష్యంగా మండలంలోని చిన్నగంజాం జేడ్పి హైస్కూలు పదివ తరగతి విద్యార్థులకు బ్రహ్మకుమారీస్ ఈశ్వరీయ సేవా కార్యక్రమంలో భాగంగా దాత కుక్కల వెంకట కృష్ణారెడ్డి స్వంత నిధులతో సమకుర్చిన ఆల్ ఇన్ వన్ పుస్తకాలను ప్రధానోపాధ్యాయులు కె.శ్రీనివాసరెడ్డి సమక్షంలో సోమవారం ఉచితంగా పంపిణీ నిర్వహించారు. ఇ సందర్భంగా దాత వెంకటకృష్ణ రెడ్డి మాట్లాడుతూ త్వరలో జరగనున్న పది పబ్లిక్ పరిక్షలో మన స్కూల్ విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ చూపి మంచి మార్కులు సాధించి బంగారు భవిష్యత్తుకు బాటలు వేసుకోవలన్నారు. కష్టపడి చదివి ఉన్నత స్థానాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు.ఇ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాసరెడీ మాట్లాడుతూ పేద విద్యార్థులకు బ్రహ్మకుమారీస్ ఈశ్వరీయ సేవా కార్యక్రమంలో భాగంగా ఆల్ ఇన్ వన్ పుస్తకాలు అందజేయ్యటం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు కె శ్రీనివాసరెడ్డి, ఉపాధ్యాయులు ఎస్ నరసింహారావు, సిహేచ్. కుమార్, పి శ్రీలక్ష్మి, గంటా అంకమ్మ, బ్రహ్మ కుమారిస్ ఎమ్ వి రామారావు, పి శ్రీనివాసరావు, సిబ్బంది పాల్గొన్నారు.

# మార్చి 16 నుంచి ఏప్రిల్ 1 వరకు 10వ తరగతి పబ్లిక్ పరీక్షలు

**ఉదయం 9.30 గంటల నుండి మధ్యాహ్నం 12.45 గంటల వరకు**

**పరీక్షలకు సిద్ధమైన బాలికలు 7967, బాలురు 7977**

**82 పరీక్ష కేంద్రాలు, 6 ఫ్లైయింగ్ స్క్వాడ్‌లు ఏర్పాటు**


**పరీక్షలు జరిగే రోజు జీరాక్స్ సెంటర్స్ మూసివేయాలి**

**పరీక్షలు జరిగే రోజు 144 సెక్షన్ అమలులో ఉంటుంది**

**పరీక్ష కేంద్రాలను ముందుగానే పరిశీలించాలి**

**ప్రశాంత వాతావరణంలో పరీక్షలు నిర్వహించాలి**

**జిల్లా కలెక్టర్ డాక్టర్ వి వినోద్ కుమార్**




(షణ్ముఖ వెలుగు, బాపట్ల, ఫిబ్రవరి 2)
జిల్లాలో మార్చి 16 నుంచి ఏప్రిల్ 1 వరకు నిర్వహించే 10 వ తరగతి పబ్లిక్ పరీక్షలు ఎలాంటి ఇబ్బందులు లేకుండా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ వి వినోద్ కుమార్ తెలిపారు. సోమవారం స్థానిక జిల్లా కలెక్టరేట్లోని పిజిఆర్ఎస్ హాల్ నందు మార్చి 16 నుంచి ఏప్రిల్ 1 వరకు నిర్వహించి పదవ తరగతి పరీక్షలు నిర్వహించి సమన్వయ కమిటీ జిల్లా కలెక్టర్ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ మార్చి నెలలో నిర్వహించి 10వ తరగతి పరీక్షల్లో ఎలాంటి చిన్న పొరపాటు జరగకుండా విద్యార్థులు ప్రశాంత వాతావరణంలో పరీక్షలు వ్రాసే విదంగా సంబంధిత అధికారులు సమన్వయంతో పనిచేసి విజయవంతముగా నిర్వహించాలని సంబంధిత అధికారులు ఆదేశించారు. 10 వ తరగతి పరీక్షలు నిర్వహించే పరీక్ష కేంద్రాలను తహశీల్దార్లు, ఆర్డీఓలు,డి ఈఓ, ఎంఈఓలు ముందుగా పరీక్ష కేంద్రాల ను పరిశీలించి అక్కడ ఏమైనా సమస్యలు ఉంటే పరీక్షలు నిర్వహించే రోజు నాటికి విద్యార్థులు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని రకాల మౌలిక సదుపాయాలను సిద్ధం చేయాలని ఆదేశించారు. విద్యార్థులు 9 గంటల కల్లా పరీక్ష కేంద్రానికి చేరుకోవాలని,సెల్ ఫోన్స్, ఎలక్ట్రానిక్ వస్తువులు పరీక్ష కేంద్రంలోనికి అనుమతి లేదని తెలిపారు. విద్యార్థులు 9 గంటలకల్లా వారి కేటాయించిన పాఠశాలకు చేరుకునే విధంగా ఆర్టీసీ అధికారులు బస్సులు ఏర్పాటు చేయాలని, పరీక్షా కేంద్రాల వద్ద ఓఆర్ఎస్ ఫస్ట్ ఎయిడ్, ఏఎన్ఎం నియమించాలని,పరీక్ష సమయంలో విద్యుత్ అంతరాయం లేకుండా చూడాలని,విద్యుత్ అధికారులు చర్యలు తీసుకోవలన్నారు. పరీక్షలు అయిన వెంటనే జవాబు పత్రాలను సమీపంలో ఉన్న పోస్ట్ ఆఫీస్ కు అందజేయాలన్నారు. పరీక్ష జరిగే రోజు 144 సెక్షన్ విధించడంతోపాటు ఆ పరిసర ప్రాంతంలో ఉన్న జిరాక్స్ సెంటర్లను మూసివేయాలని సంబంధిత అధికారులు ఆదేశించారు. జిల్లాకు వచ్చే ప్రశంస పత్రాలను జాగ్రత్తగా స్ట్రాంగ్ రూములు భద్రపరచాలని, పరీక్ష కేంద్రాలకు ప్రశ్న పాత్రలను బందోబస్తు ద్వారా తీసుకెళ్లాలని వీటికి సంబంధించి సంబంధిత మండల స్థాయి పోలీసు అధికారులు నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో డీఈఓ శ్రీనివాసులు, డియంహెచ్ఓ డాక్టర్ విజయమ్మ, పోలీసు, విద్యుత్, ఆర్టీసీ, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధిహామీ పథకాన్ని నిర్వీర్యం చేయొద్దు





(షణ్ముఖ వెలుగు, ఉలవపాడు, ఫిబ్రవరి 2)
మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని పాత పద్ధతిలోనే కొనసాగించాలని, కొత్తగా ప్రవేశపెట్టిన విబిజి రాంజీ స్కీమ్ ను రద్దుచేయాలని, పథకంలో గాంధీజీ పేరును ఉంచాలని, పని గ్యారంటీ హక్కును రద్దు చేయడాన్ని నిరసిస్తూ ఉలవపాడు సచివాలయంలో పంచాయతీ కార్యదర్శి వీరయ్యకు సిపిఎం ఉలవపాడు ప్రాంతీయ కమిటీ కార్యదర్శి జీవీబీ కుమార్ నేతృత్వంలో కరేడు సచివాలయంలో గొల్లపోతు శివకుమార్ నేతృత్వంలో వినతిపత్రాలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న జీవీబీ కుమార్ మాట్లాడుతూ 2005లో వామపక్షాల ఒత్తిడితో మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం వచ్చిందని పేర్కొన్నారు. పథకం వచ్చిన తర్వాత కూలీల ఆత్మగౌరవం పెరిగిందని, కూలి రేట్లు పెరిగాయని పేర్కొన్నారు. దానిని ఇంకా సమర్థవంతంగా అమలు చేయాల తప్ప, కేంద్ర ప్రభుత్వం పథకాన్ని నిర్వీర్యం చేస్తే సహించేది లేదని జీవిబి కుమార్ హెచ్చరించారు. ఫిబ్రవరి 5న అన్ని మండల కేంద్రాలలో తహసిల్దార్ ఆఫీస్ వద్ద ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఉపాధి కూలీలు అందరూ పాల్గొనాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు గొల్లపోతు శివకుమార్, జువ్వికుంట వెంకటేశ్వర్లు, ఉపాధి కూలీలు ఎస్కె బాజీ, జి నాగేశ్వరరావు, ఓ వినోద్, దామతోటి మధు, తదితరులు పాల్గొన్నారు.

## మార్కాపురం జిల్లాలో ప్రజా సమస్యల పరిష్కరించేందుకు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి

### జాయింట్ కలెక్టర్ పులి శ్రీనివాసులు

(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, మార్కాపురం, ఫిబ్రవరి 2)
మార్కాపురం, జిల్లాలో ప్రజా సమస్య లను పరిష్కరించడా నికి ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని జాయింట్ కలెక్టర్ పులి శ్రీనివాసులు అధికారులను ఆదేశించారు. సోమవారం స్థానిక కలెక్టరేట్ లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని జాయింట్ కలెక్టర్ నిర్వహించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ప్రజలు సమస్యల పరిష్కారం కోసం ఎంతో వ్యయ ప్రయాసలతో వస్తారని వారి సమస్యలను సానుకూలంగా విని పరిష్కరించడానికి చర్యలు తీసుకోవాలన్నారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో వచ్చిన అర్జీలను ప్రభుత్వ విధించిన గడువులోగా పరిష్కరించడానికి తీసుకోవాలని ఆయన చెప్పారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో ప్రజల నుండి వచ్చిన అర్జీలను తృప్తి చెందే విధంగా పరిష్క రించాలన్నారు. కలెక్టరేట్‌లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో రెవెన్యూ సమస్యలను పరిష్కరించడానికి ప్రత్యేకంగా రెవిన్యూ క్లినిక్ లను ఏర్పాటు చేశామని ఆయన చెప్పారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి వచ్చి అర్జీదారులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా త్రాగు నీరు భోజన సౌకర్యాలను కల్పించామని ఆయన చెప్పారు. ప్రజా సమస్యల పరిష్కార పరిష్కార వేదిక కార్యక్రమంలో రెవిన్యూ అంశాలకు సంబంధించి అర్జీలు ప్రజల నుండి వస్తున్నాయని, రాబోయే 6 నెలల్లో రెవిన్యూ సమస్యలను పరిష్కరించడానికి చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో మార్కపురం రెవెన్యూ డివిజనల్ అధికారి శివరామిరెడ్డి, కనిగిరి రెవిన్యూ డివిజనల్ అధికారి కేశవర్ధన్‌రెడ్డి, జిల్లా మహిళాశిశు సంక్షేమ శాఖ అధికారి పద్మావతి, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ టి వాణిశ్రీ, జిల్లా వ్యవసాయశాఖ అధికారి బాలాజీ నాయక్, జిల్లా ఉద్యా నవనశాఖ అధికారి ఆదిరెడ్డి, మత్స్యశాఖ అధికారి శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.






## మార్చి 3 నుంచి 13 వరకు ఓపెన్ స్కూల్ ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షలు

**1930 మంది విద్యార్థులు హాజరు**

**ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్ష కేంద్రాలు 9**

**పరీక్షలు జరిగే రోజు జీరాక్స్ సెంటర్స్ మూసివేయాలి**

**పరీక్షలు జరిగే రోజు 144 సెక్షన్ ఉంటుంది**

**పరీక్ష కేంద్రాలను ముందుగానే పరిశీలించాలి**

**ప్రశాంత వాతావరణంలో పరీక్షలు నిర్వహించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ వి వినోద్ కుమార్**

(షణ్ముఖ వెలుగు,బాపట్ల, ఫిబ్రవరి 2)
జిల్లాలో మార్చి 3 నుంచి 13 వరకు ఓపెన్ స్కూల్ నిర్వహించే ఇంటర్మీడియట్ పరీక్షలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ వి వినోద్ కుమార్ తెలిపారు. సోమవారం స్థానిక జిల్లా కలెక్టరేట్లోని పి జి ఆర్ ఎస్ హాల్ నందు మార్చి 3 నుంచి 13 వరకు నిర్వహించి ఇంటర్మీడియట్ ఓపెన్ స్కూల్ నిర్వహించి సమన్వయ కమిటీ సమావేశాన్ని జిల్లా కలెక్టర్ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ మార్చి నెలలో నిర్వహించి ఓపెన్ ఇంటర్మీడియట్ పరీక్షలు ఎలాంటి చిన్న పొరపాటు జరగకుండా విద్యార్థులు ప్రశాంత వాతావరణంలో పరీక్షలు వ్రాసే విదంగా సంబంధిత అధికారులు సమన్వయంతో పనిచేసి విజయవంతముగా నిర్వహించాలని సంబంధిత అధికారులు ఆదేశించారు. పరీక్ష కేంద్రాలను తహశీల్దార్లు, ఆర్డీఓలు,డి ఈఓ, ఎంఈఓలు ముందుగా పరీక్ష కేంద్రాల ను పరిశీలించి అక్కడ ఏమైనా సమస్యలు ఉంటే పరీక్షలు నిర్వహించే రోజు నాటికి విద్యార్థులు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని రకాల మౌలిక సదుపాయాలను సిద్ధం చేయాలని ఆదేశించారు. విద్యార్థులు ఉదయం 8.30 గంటల కల్లా పరీక్ష కేంద్రానికి చేరుకోవాలని, సెల్ ఫోన్స్, ఎలక్ట్రానిక్ వస్తువులు పరీక్ష కేంద్రంలోనికి అనుమతి లేదని తెలిపారు. విద్యార్థులు 8.30 గంటలకల్లా వారి కేటాయించిన పాఠశాలకు చేరుకునే విధంగా ఆర్టీసీ అధికారులు బస్సులు ఏర్పాటు చేయాలని, పరీక్షా కేంద్రాల వద్ద ఓఆర్ఎస్ ఫస్ట్ ఎయిడ్, ఏఎన్ఎం నియమించాలని, పరీక్ష సమయంలో విద్యుత్ అంతరాయం లేకుండా చూడాలని, విద్యుత్ అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. పరీక్షలు అయిన వెంటనే జవాబు పత్రాలను సమీపంలో ఉన్న పోస్ట్ ఆఫీస్‌కు అందజేయాలన్నారు. పరీక్ష జరిగే రోజు 144 సెక్షన్ విధించడంతో పాటు ఆ పరిసర ప్రాంతంలో ఉన్న జిరాక్స్ సెంటర్లను మూసివేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. జిల్లాకు వచ్చే ప్రశంస పత్రాలను జాగ్రత్తగా స్ట్రాంగ్ రూములో భద్రపరచాలని, పరీక్ష కేంద్రాలకు ప్రశ్న పాత్రలను బందోబస్తు ద్వారా తీసుకెళ్లాలని, వీటికి సంబంధించిన పత్రాలను సంబంధిత మండల స్థాయి పోలీసు అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో డీఈఓ శ్రీనివాసులు, డియంహెచ్ఓ డాక్టర్ విజయమ్మ, పోలీసు, విద్యుత్, ఆర్టీసీ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

On behalf of PRINTER, PUBLISHER OWNED BY OBULASETTY RADHAKRISHNA DASS AND PRINTED AT HARI PRINTERS AND PUBLICATIONS, FLOT 51, NEAR B.V.SUBBAIAH SCHOOL ROAD, PERNAMITTA, SANTANUTALAPADU (MANDAL), PRAKASAM/ONGOLE (Dt), ANDHRA PRADESH, PIN : 523225. Mobile : 9494177939, RNI : APTEL/2023/89152, e-mail : rkreport9@gmail.com. E-Paper : shanmukhavelugu.com

# పిజిఆర్ఎస్ కు 235 అర్జీలు
# ప్రతి అర్జీని పరిశీలించి పరిష్కరం చూపాలి



## జిల్లా కలెక్టర్ డాక్టర్ వి వినోద్ కుమార్

**(షణ్ముఖ వెలుగు, బాపట్ల, ఫిబ్రవరి 2)**

ప్రతి సోమవారం జిల్లా కలెక్టరేట్ లో నిర్వహించే పిజిఆర్ఎస్ లో అర్జీదారుల ఇచ్చే సమస్యల అర్జీలను పరిశీలించి పరిష్కరం చూపాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ వి వినోద్ కుమార్ తెలిపారు. సోమవారం కలెక్టరేట్‌లోని హాల్ నందు నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పి.జి.ఆర్.ఎస్) కార్యక్రమంలో భాగంగా జిల్లాలోని వివిధ మండలాల నుంచి వివిధ రకాల సమస్యలతో వచ్చిన అర్జీదారులు చెప్పే సమస్యలను వింటూ వారి నుంచి అర్జీలను స్వీకరించిన జిల్లా కలెక్టర్ డాక్టర్ వి వినోద్ కుమార్, జాయింట్ కలెక్టర్ భావన, జిల్లా రెవెన్యూ అధికారి గంగాధర్ గౌడ్, డిప్యూటీ కలెక్టర్ లవన్న అర్జీదారుల నుంచి అర్జీలను స్వీకరించారు. సోమవారం జిల్లాలోని వివిధ మండలాల నుంచి వివిధ రకాల సమస్యల 235 అర్జీలు పిజిఆర్ఎస్‌లో నమోదు అయ్యాయి. మాకు న్యాయం చేయండి అంటూ అర్జీదారులు అధికారులను కోరారు. తన పరిధిలోని వాటికి అక్కడికక్కడే పరిష్కారమార్గం చూపడం జరుగుతుందని,



కొన్నిటిని పరిశీలన, మరికొన్నింటిని విచారించాలని తర్వాత సంబంధిత అధికారులకు పంపించడం జరుగుతుంది అర్జీదారుల కు చూచించారు. ప్రజల సమస్యలను నాణ్యతతో పరిష్కరించాలని కలెక్టర్ సంబంధిత అధికారులకు సూచించారు. గ్రామ, మండల స్థాయిలో ప్రజల నుంచి ఆర్జీల స్వీకరణ జరుగుతుందన్నారు. ప్రతి సోమవారం ఇదే క్రమాన్ని పాటించాలని సూచించారు. నమోదైన అర్జీలను పరిశీలించిన, తదుపరి పరిష్కారానికి ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ప్రతి అర్జీని క్షుణ్ణంగా పరిశీలించాలన్నారు. ప్రజాప్రతినిధుల వద్దను పిజిఆర్ఎస్ జరుగుతుందని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో డియంహెచ్ఓ డాక్టర్ ఎస్ విజయమ్మ, సిపిఓ ఏఎస్ రాజు, డ్వామా, డిఆర్డీఏ, మెప్మా, ఐసిడిఎస్, గృహ నిర్మాణ సంస్థ విజయలక్ష్మి, సింగయ్య, పాల్, రాధమాదవి, వెంకటేశ్వరరావు, మార్క్‌ఫెడ్ డియం కరుణశ్రీ, డిసిహెచ్ఎస్ పద్మావతి, డిటిసి పరంధామరెడ్డి, జి యం డిఐసి రామకృష్ణ, జిల్లా వ్యవసాయ అధికారిణి విజయనిర్మల, డిపిఓ యల్ ప్రభాకర్‌రావు, డిఈఓ శ్రీనివాస్, బిసి, గిరిజన సంక్షేమ శాఖల అధికారులు శివలీలా, అబ్బులు, డియల్‌డిఓ విజయలక్ష్మి, వివిధ శాఖల జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# వెలిగొండ ప్రాజెక్టు విషయంలో వైసిపి పార్టీ నిలువునా ప్రజలను దగా చేసింది

### మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి





**(షణ్ముఖ వెలుగు, కొనకనమిట్ల, ఫిబ్రవరి 2)**

వెలిగొండ ప్రాజెక్టు విషయంలో వైసిపి పార్టీ నిలువునా ప్రజలను దగా చేసిందని మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి అన్నారు. మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి సోమవారం మండలంలోని చినారికట్ల గ్రామంలో మార్కాపురం జిల్లా ఇచ్చినందుకు కృతజ్ఞతగా రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చిత్రపటానికి పాలాభిషేకం కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఇటీవల వ్యవసాయశాఖ అధికారులు ప్రతి ఇంటికి వెళ్లి సర్వే చేసి రైతుల అవసరాలు ఏమిటో కనుక్కొని ప్రభుత్వానికి నివేదిక ఇచ్చారని అన్నారు. ఇక ఇటీవల సంభవించిన మొంథా తుఫాన్ సంభవించినప్పుడు మేము, అధికారులం ఎక్కడ ఏ ఇబ్బంది ఉన్న ప్రతి చోట పర్యటించి ఏ సమస్య ఉన్న పరిష్కారం చేశామన్నారు. అప్పుడు వైసిపి నాయకులు ఎక్కడ ఉన్నారని ప్రశ్నించారు. వెలుగొండ ప్రాజెక్టు విషయంలో పూర్తికాని వెలుగొండ ప్రాజెక్టును జగన్‌రెడ్డి జాతికి అంకితం చేసి వెళ్లిపోయారని, కానీ ఇప్పటికీ ప్రాజెక్టు పూర్తి కావడానికి దాదాపు రూ.3 వేల కోట్లు అవసరమన్నారు. ఈ విషయంలో ప్రజలను నిలువునా వైసిపి దగా చేసిందన్నారు. మార్కాపురం జిల్లా విషయంలో వైసిపి నాయకులు గత వైసిపి ప్రభుత్వంలో కనీసం స్పందించలేదన్నారు. కానీ 63 రోజులు పాటు దీక్షలు చేసి చంద్రబాబు నాయుడుకి ప్రత్యేక జిల్లా అవసరం గురించి వివరించానని అధికారంలోకి వచ్చిన వెంటనే మార్కాపురం జిల్లా ఇస్తానని చంద్రబాబు నాయుడు మాట ఇచ్చి, ఇచ్చిన మాట ప్రకారం మార్కాపురం ప్రత్యేక జిల్లాగా ప్రకటించారని, ఈ ప్రాంత ప్రజలు ఎప్పుడు వారికి రుణపడి ఉంటారన్నారు. త్వరలోనే వెలుగొండ ప్రాజెక్టును పూర్తి చేసి ఈ ప్రాంత ప్రజల కోరికను తీరుస్తామన్నారు. కొనకనమిట్ల మండలంలో రిలయన్స్ బయో గ్యాస్ ప్లాంట్ మూడు వేల కోట్లతో త్వరలోనే పూర్తి చేసి 3000 మందికి ఉద్యోగాలు, 30 వేల మంది రైతులకు లబ్ది కలిగేటట్టు చూస్తానని మాట ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు మూరబోయిన బాబురావు యాదవ్, గొట్లగట్టు సర్పంచ్ పెరికె సుఖదేవ్, మాజీ మండల పార్టీ అధ్యక్షులు తాతిరెడ్డి వెంకటేశ్వరరెడ్డి, మువ్వ కాటం రాజు, ఇతర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# వెల్ బీయింగ్ అవుట్ ఆఫ్ వేస్ట్ కార్యక్రమ స్వచ్ఛ మిత్రలతో సమావేశం




**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, ఫిబ్రవరి 2)**

నగరపాలక సంస్థ కమీషనర్ కోడూరు వెంకటేశ్వరావు సోమవారం సాయంత్రం ఐటీసీ వారి సహకారంతో నిర్వహిస్తున్న వెల్ బీయింగ్ అవుట్ ఆఫ్ వేస్ట్ కార్యక్రమ స్వచ్ఛ మిత్రలతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో భాగంగా కమీషనర్ మాట్లాడుతూ ఒంగోలు నగరంలో సానిటేషన్ పనుల పురోగతి మెరుగుపర్చుకోవటం కోసం స్వచ్ఛ మిత్రలను ఏర్పాటు చేయడం జరిగినది అని తెలిపారు. ఇందులో భాగంగా ప్రతి ఒక్క స్వచ్ఛ మిత్ర కూడా వారికి కేటాయించిన వార్డ్ లలో ప్రతి ఇంటి నుంచి కూడా ప్రతి రోజు చెత్త సేకరణ జరుగుతున్నది లేదో తెలుసుకొని, ఎక్కడ అయినా జరగని ఎడల వెంటనే ఎంహెచ్‌వోకి గాని, ఎగ్జిక్యూటివ్ అథారిటీ వారికి తెలియపరచాలని సూచించారు. అలానే ప్రజలు అందరూ కూడా చెత్త ఇచ్చేటప్పుడు దానిని తప్పనిసరిగా పొడి చెత్త, తడి చెత్తగా వేరు చేసి ఇచ్చేవిధముగా ప్రజలలో అవగాహన కల్పించాలి స్వచ్ఛ మిత్రలకు ఆదేశాలు జారీ చేశారు. ప్రతివారంలో 5 రోజులు తడిచెత్తను, రెండు రోజులు (బుధవారం, ఆదివారం) మాత్రమే పొడి చెత్తను సేకరిస్తామని స్వచ్ఛ మిత్రలు ప్రజలకు తెలియజేయాలని సూచించారు. ప్రతి స్వచ్ఛ మిత్ర కూడా వారికి కేటాయించిన వార్డ్ యొక్క సానిటేషన్ సెక్రటరీ మరియు శానిటరీ సూపర్వైజర్ ల సహకారం తీసుకొని ఆయా వార్డులలో తప్పనిసరిగా సానిటేషన్ పనులు జరిగేలా చూడాలని వారికి సూచించారు. అలానే వారికి విధులలో ఏమీ అయినా ఇబ్బంది ఉన్నట్లు అయితే డైరెక్ట్‌గా ఎగ్జిక్యూటివ్ అథారిటీ దృష్టికి తీసుకురావాల్సిందిగా తెలిపారు. ఈ సమావేశంలో నగరపాలక సంస్థ కమీషనర్ కె వెంకటేశ్వరరావుతో పాటు, ఐటీసీ నుంచి సునీల్ కుమార్, ఎంహెచ్‌వో వైష్ణవి, ఎస్ఎస్ పిచ్చయ్య, స్వచ్ఛ మిత్ర కోఆర్డినేటర్స్, 50 మంది స్వచ్ఛ మిత్రలు పాల్గొన్నారు.



# గుడ్ హెల్ప్ డైరెక్టర్ పుట్టినరోజు సేవా కార్యక్రమాలు



**(షణ్ముఖ వెలుగు, కనిగిరి టౌన్, ఫిబ్రవరి 2)**

గుడ్ హెల్ప్ ఫౌండేషన్ డైరెక్టర్ ఆర్‌టిసి కండక్టర్ మంద్రు రమేష్ బాబు తన పుట్టినరోజును ఆడంబరాలకు దూరంగా, సేవా కార్యక్రమాలతో అర్థవంతంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా సోమవారం కనిగిరి మున్సిపాలిటీ పరిధిలోని చింతలపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో మున్సిపాలిటీ చైర్మన్, న్యాయవాది షేక్ అబ్దుల్ గఫార్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులకు ప్రముఖ రచయిత యండమూరి వీరేంద్రనాథ్ రచించిన మొదటి ర్యాంకు - 100 సూత్రాలు అనే ప్రేరణాత్మక పుస్తకాలను గుడ్ హెల్ప్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో పంపిణీ చేశారు. విద్యార్థులు లక్ష్య సాధనలో క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం, కష్టపడి చదవడం ఎంతో అవసరమని వక్తలు సూచించారు. మున్సిపాలిటీ చైర్మన్ షేక్ అబ్దుల్ గఫార్ మాట్లాడుతూ విద్యార్థుల్లో చదువు పై ఆసక్తిని పెంచే ఇటువంటి కార్యక్రమాలు అభినందనీయమని, గుడ్ హెల్ప్ ఫౌండేషన్ చేస్తున్న సేవలు సమాజానికి ఆదర్శంగా నిలుస్తున్నాయని ప్రశంసించారు. మానవ సేవే మాధవ సేవ అనే భావనతో తన పుట్టినరోజును సేవా దినంగా జరుపుకున్నట్లు మంద్రు రమేష్ బాబు తెలిపారు. భవిష్యత్తులో కూడా విద్య, ఆరోగ్యం, సామాజిక సేవ రంగాల్లో మరిన్ని కార్యక్రమాలు చేపడతామని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు రామశర్మ, మదర్ సేవా సమితి అధ్యక్షులు సయ్యద్ నాయబ్ రసూల్, ఉపాధ్యాయులు, గుడ్ హెల్ప్ ఫౌండేషన్ సభ్యులు, విద్యార్థులు, పాల్గొని మంద్రు రమేష్ బాబుకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

# టిడిపి నేత ఇమామ్ సాహెబ్ మృతి నివాళులర్పించిన ఎమ్మెల్యే కందుల



**(షణ్ముఖ వెలుగు, తర్లుపాడు, ఫిబ్రవరి 2)**

మండల కేంద్రంలో సీనియర్ టీడీపీ నేత ఇమామ్ సాహెబ్ మృతి చెందారు. విషయం తెలుసుకున్న మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి నివాళులర్పించారు. ఇమామ్ సాహెబ్ భౌతిక కాయానికి ఎమ్మెల్యే కందుల నారాయణ రెడ్డి పూలమాల వేసి అంజలి ఘటించారు. పార్టీ అభివృద్ధికి ఆయన చేసిన సేవలను ఈ సందర్భంగా ఎమ్మెల్యే గుర్తు చేసుకున్నారు. వార్డు మెంబర్‌గా ప్రజలకు ఎంతో చేరువైన వ్యక్తిని కోల్పోవడం పార్టీకి, గ్రామానికి తీరని లోటని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. మృతుడి కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే కందుల పరామర్శించి, వారికి తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. పార్టీ పరంగా, వ్యక్తిగతంగా ఆ కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మండల టిడిపి నాయకులు, స్థానిక తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఇమామ్ సాహెబ్‌కు చివరి వీడ్కోలు పలికారు.

# మహిళల భద్రత పై అవగాహన



**(షణ్ముఖ వెలుగు, పొన్నలూరు, ఫిబ్రవరి 2)**

మండలంలోని చెన్నుపాడు వెలుగు కార్యాలయంలో సోమవారం ఎస్సై సత్యనారాయణ మహిళల భద్రతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సత్యనారాయణ మాట్లాడుతూ విద్యార్థులపై జరుగుతున్న అఘాయిత్యాలు, వేధింపులు, షీ టీం పనితీరుపై డ్వాక్రా మహిళలకు వివరించారు. స్మార్ట్ ఫోన్ వినియోగం పెరిగిపోవడంతో సైబర్ మోసాలు జరుగుతున్నాయని మోసగాళ్ల ఉచ్చులో పడకుండా అప్రమత్తంగా ఉండాలని వారికి తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రవణమ్మ, ఏబీఎన్ శ్రీనివాసరావు, మండల సమైక్య అధ్యక్షురాలు కె మధు కుమారి, సీసీలు డ్వాక్రా మహిళలు పాల్గొన్నారు.

# జగన్నాధపురం పాఠశాలకు పెరుమాళ్ళ బాలమోహన్‌రావు రూ.15 వేల విలువైన బీరువా విరాళం

### దాతల సహకారంతో పాఠశాల అభివృద్ధి చేస్తున్న ప్రధానోపాధ్యాయులు కశెట్టి జగన్



**(షణ్ముఖ వెలుగు, తర్లుపాడు, ఫిబ్రవరి 2)**

మండలంలోని జగన్నాధపురం గ్రామంలోని మండలప్రాథమిక పాఠశాలలో మౌలిక వసతుల కల్పనకు దాతలు ముందుకు రావడం అభినందనీయమని పాఠశాల ప్రధానోపాధ్యాయులు కశెట్టి జగన్ బాబు అన్నారు. పాఠశాల రికార్డులను భద్రపరచుకోవడానికి ఎదురవుతున్న ఇబ్బందులను గమనించిన నంద్యాల వాస్తవ్యులు పెరుమాళ్ళ బాలమోహన్‌రావు తన ఉదారతను చాటుకుంటూ సుమారు రూ.15 వేల విలువైన నూతన బీరువాను సోమవారం పాఠశాలకు అందజేశారు. దాతల సహకారంతో మారుతున్న పాఠశాల రూపురేఖలు ప్రధానోపాధ్యాయులు జగన్ బాబు బాధ్యతలు చేపట్టినప్పటి నుండి, ప్రభుత్వ నిధులతో పాటు దాతల సహకారాన్ని కూడా కూడగడుతూ పాఠశాలలో అన్ని వసతులు చేకూరుస్తున్నారు. గతంలో కూడా పలువురు దాతల సహకారంతో విద్యార్థులకు అవసరమైన కనీస సౌకర్యాలను కల్పించిన ఆయన, ఇప్పుడు రికార్డుల భద్రత కోసం బీరువాను సమకూర్చడం పట్ల స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు మాట్లాడుతూ పాఠశాల అభివృద్ధికి బాలమోహన్ రావు ముందుకు రావడం చాలా సంతోషకరమన్నారు. విద్యార్థుల భవిష్యత్తు కోసం, పాఠశాల పురోగతి కోసం దాతలు అందించే చిన్న సహాయం కూడా ఎంతో విలువైనదన్నారు. ఈ బీరువా సహాయంతో పాఠశాల రికార్డులు మరింత సురక్షితంగా ఉంటాయన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది, విద్యార్థులు, గ్రామ ప్రముఖులు పాల్గొని దాత పెరుమాళ్ళబాలమోహన్‌రావుకి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.